FLASH INDIA NEWS ప్రతిక్షణం.. ప్రజలకోసం...

www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229



**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు,నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039



సంపుటి : 17 | సంచిక : 179 | శనివారం 22.08.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-




## ఇక నెలకు రూ.350లకే మంత్లీ టోల్ పాస్

- రూ.350కే ఫాస్టాగ్ లోకల్ పాస్.. స్థానికులకు భారీ ఊరట
- టోల్ క్యూలకు చెక్.. ఇక ఇంటి నుంచే లోకల్ పాస్
- 121 టోల్ ప్లాజాలకు ఆన్‌లైన్ లోకల్ పాస్ సేవలు
- 20 కి.మీ పరిధిలోని స్థానికులకే రూ.350 పాస్

05

## శోకసంద్రంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ..

- 95 ఏళ్ల వయసులో ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి
- కన్నుమూత.. సినీ పరిశ్రమలో తీవ్ర విషాదం..
- శ్వాసకోశ సమస్యలతో చికిత్స పొందుతూ షావుకారు జానకి మృతి
- చెన్నై కావేరి ఆస్పత్రిలో కన్నుమూసిన షావుకారు జానకి

02



# చక్కెర ధరల భగభగ

## ఇథనాల్ పాలసీని తప్పుబట్టిన కేజ్రీవాల్

**చెరుకు కొరతతో చక్కెర ధరలకు రెక్కలు**

- ఇథనాల్ పాలసీతో దేశంలో చక్కెర సంక్షోభం
- చెరుకును ఇథనాల్‌కు మళ్లించడంతో పెరిగిన చక్కెర ధరలు
- చక్కెర కొరత.. ఇథనాల్ విధానంపై కేంద్రంపై విమర్శలు
- ఈ20 విధానంతో ప్రజలపై పెరుగుతున్న ఆర్థిక భారం
- ఇథనాల్ కోసం చెరుకు మళ్లింపు.. చక్కెరకు కొరత
- చక్కెర దిగుమతులకు కేంద్రం.. ఇథనాల్ పాలసీపై చర్చ
- చక్కెర, బెల్లం ధరల పెరుగుదలపై ప్రతిపక్షాల ఫైర్

03



# విదేశాంగ శాఖ అనుమతి నిరాకరణ

**రేవంత్ యూకే పర్యటనకు ఓకే.. యూఎస్ టూర్‌కు నో..**

## 'తెలంగాణ రైజింగ్' ఆగదు: సీఎం రేవంత్ రెడ్డి

### అందుకే అనుమతి ఇవ్వలేదు..స్పందించిన కేంద్రం

- సీఎం రేవంత్ అమెరికా పర్యటన రద్దు.. కేంద్రం నో క్లియరెన్స్
- లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు రేవంత్ రెడ్డి
- చివరి నిమిషంలో అమెరికా పర్యటనకు కేంద్రం బ్రేక్
- యూకే పర్యటనకు మాత్రమే కేంద్రం అనుమతి
- అమెరికా పర్యటన రద్దుపై తెలంగాణ రాజకీయాల్లో చర్చ
- 'తెలంగాణ రైజింగ్' ఆగదు.. సీఎం రేవంత్ రెడ్డి
- యూఎస్‌కు అధికారుల బృందాన్ని పంపనున్న సీఎం
- హార్వర్డ్, ఎంఐటీ తో భాగస్వామ్యాలకు అధికారుల బృందం
- తెలంగాణ యువత భవిష్యత్తే లక్ష్యమన్న రేవంత్
- రాజకీయాలకు అతీతంగా తెలంగాణ అభివృద్ధే ధ్యేయమన్న సీఎం
- అమెరికా పర్యటనకు క్లియరెన్స్ ఎందుకు ఇవ్వలేదంటే..
- ప్రతిపాదిత కార్యక్రమం అనుగుణంగా లేదన్న కేంద్రం

02

**ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్‌తో రేవంత్ కీలక సమావేశాలు**



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుతం షెడ్యూల్ ఉన్న అమెరికా పర్యటన రద్దయింది. బ్రిటన్ పర్యటనను విజయవంతంగా ముగించుకున్న సీఎం, ఈనెల 23న లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. రద్దయిన ఈ పర్యటనను వచ్చే నెలలో తిరిగి చేపట్టాలని ఆయన భావిస్తున్నట్లుగా తెలుస్తోంది.

**కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి నిరాకరణ**

తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా లండన్, అమెరికాలలో తెలంగాణ రైజింగ్ పేరుతో ప్రతినిధుల సమావేశాలు నిర్వహించడానికి ప్రొటోకాల్ ప్రకారం తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసింది. అయితే, చివరి నిమిషంలో కేంద్ర విదేశాంగ శాఖ కేవలం యూకేలో నిర్వహించే సమావేశాలకు మాత్రమే అనుమతిని ఇచ్చింది.




## బేగంపేటను ముంచెత్తిన ఫ్లెక్సీల హంగామా..

- హైదరాబాద్‌లో జగన్‌కు బీఆర్ఎస్ నేతల ఘన స్వాగతం
- జగన్ రాకతో తెలంగాణ రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ
- ఒకే కటౌట్‌లో జగన్, కేసీఆర్, కేటీఆర్ చిత్రాలు
- బేగంపేట నుంచి జలవిహార్ వరకు భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు
- జగన్‌కు స్వాగతంగా నగరంలో భారీ ఏర్పాట్లు

02



# సురేఖను తొలగించాల్సిందే

## కూతురు మాట్లాడితే తల్లికి సంబంధం ఉండదా

**చెట్టు మీద ఉండి ఆ కొమ్మనే నరుకుతున్నారు: వేముల వీరేశం**

**విపక్షాల కుట్రలను అమలు చేస్తున్నారు: బాలు నాయక్**

**పార్టీకి ఇచ్చే గౌరవం ఇదా..: నాయిని రాజేందర్ రెడ్డి**


- కొండా సురేఖపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఫైర్
- సురేఖను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్
- కొండా కుటుంబంపై కాంగ్రెస్‌లో పెరుగుతున్న అసంతృప్తి
- సుస్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ఆగ్రహం
- సీఎం రేవంత్‌కు కొండా కుటుంబం క్షమాపణ చెప్పాలన్న ఎమ్మెల్యేలు
- కూతురి వ్యాఖ్యలను సురేఖ ఖండించకపోవడంపై విమర్శలు
- సురేఖను పార్టీ నుంచి కూడా డిస్మిస్ చేయాలన్న డిమాండ్
- సీఎంను విమర్శిస్తే పార్టీ చర్యలు తప్పవన్న కాంగ్రెస్ నేతలు
- కొండా సురేఖ వైఖరిపై ఎమ్మెల్యేల తీవ్ర ఆగ్రహం
- కొండా కుటుంబం ప్రతిపక్షాలకు బలం చేకూరుస్తోందన్న ఆరోపణలు

03

## 20 మందికి పైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అత్యవసర భేటీ

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆరోపణలు చేయడం పార్టీ క్రమశిక్షణకు విరుద్ధమని అన్నారు. సుస్మిత వ్యాఖ్యలను సురేఖ ఖండించకపోవడాన్ని ప్రశ్నిస్తూ, సురేఖను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించి, పార్టీ నుంచి కూడా డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. కొండా కుటుంబం సీఎంకు, పార్టీకి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు. పార్టీపై విమర్శలు చేస్తూ కాంగ్రెస్‌లో కొనసాగడం సరికాదని, దీనివల్ల ప్రతిపక్షాలకు బలం చేకూరుతుందని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వ్యాఖ్యానించారు.

## తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సవతుల పోరు



- కాంగ్రెస్ నేతల విభేదాలపై సీపీఐ నారాయణ ఫైర్
- రేవంత్ నిక్కచ్చిగా ఉంటేనే అధికారుల్లో భయం
- 22ఏ భూముల నిబంధన దుర్వినియోగమవుతోందన్న నారాయణ
- కాంగ్రెస్ ప్రభుత్వం తమ సూచనలు పట్టించుకోవడం లేదన్న సీపీఐ
- ప్రభుత్వంలో సీపీఐ భాగస్వామి కాదు.. నారాయణ స్పష్టీకరణ
- సీట్ల సర్దుబాటు మాత్రమే చేసుకున్నామని నారాయణ వెల్లడి
- కొండా సుస్మిత వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో కలకలం
- కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు ముదురుతున్నాయన్న నారాయణ

05



## ఇక అన్నీ బయటపెడతా

**సీఎం వచ్చాకే స్పందిస్తా: సుస్మితా పటేల్**

- త్వరలో అన్ని విషయాలు వెల్లడిస్తా.. మంత్రి కొండా సురేఖ
- ఇప్పటికి చెప్పాల్సిందంతా చెప్పా.. సురేఖ క్లారిటీ
- సీఎం వచ్చాకే మాట్లాడతా.. సుస్మితా పటేల్
- రేవంత్ రెడ్డి రాగానే అన్ని విషయాలపై స్పందిస్తా
- సురేఖ నివాసంలో మీడియాతో కీలక చిట్‌చాట్
- త్వరలో పూర్తి వివరాలతో మీడియా ముందుకు వస్తా
- ప్రస్తుతం అదనంగా చెప్పడానికి ఏమీ లేదన్న సురేఖ

03




# విదేశాంగ శాఖ అనుమతి నిరాకరణ

## చివరి నిమిషంలో సీఎం అమెరికా పర్యటన రద్దు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ప్రస్తుతం షెడ్యూల్ ఉన్న అమెరికా పర్యటన రద్దయింది. బ్రిటన్ పర్యటనను విజయవంతంగా ముగించుకున్న సీఎం, ఈనెల 23న లండన్ నుంచి నేరుగా హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. రద్దయిన ఈ పర్యటనను వచ్చే నెలలో తిరిగి చేపట్టాలని ఆయన భావిస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే,

**కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి నిరాకరణ**

తెలంగాణ రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా లండన్, అమెరికాలలో తెలంగాణ రైజింగ్ పేరుతో ప్రతినిధుల సమావేశాలు నిర్వహించడానికి తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసింది. అయితే, చివరి నిమిషంలో కేంద్ర విదేశాంగ శాఖ కేవలం యూకేలో నిర్వహించే సమావేశాలకు మాత్రమే అనుమతిని ఇచ్చింది. అమెరికాలో నిర్వహించాల్సిన సదస్సులకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో, సీఎం రేవంత్ రెడ్డి తన బృందంతో కలిసి ప్రయాణాన్ని కుదించుకుని రాష్ట్రానికి తిరిగి వస్తున్నారు. వాస్తవానికి అమెరికాలోని ప్రముఖ నగరాలైన బోస్టన్, న్యూయార్క్‌లలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు సంబంధించి సర్వం సిద్ధమైంది. అక్కడి పర్యటనకు సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయం మినిట్-టు-మినిట్ షెడ్యూల్‌ను పర్యవేక్షిస్తూ ఏర్పాట్లను పూర్తి చేసింది. అయితే, చివరి నిమిషంలో కేంద్ర విదేశాంగ శాఖ అనుమతి ఇవ్వకపోవడం తెలంగాణ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున సంచలనంగా మారింది.

**'తెలంగాణ రైజింగ్' ఆగదు: సీఎం రేవంత్ రెడ్డి**

పర్యటన వాయిదా పడిన నేపథ్యంలో అమెరికాలో జరగాల్సిన భేటీలకు ఈసారి సీఎం స్వయంగా వెళ్లకుండా, అధికారుల బృందాన్ని మాత్రమే పంపాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. ఈ మొత్తం పరిణామంపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర యువత భవిష్యత్తు, తెలంగాణ అభివృద్ధే తన ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. 'ఎన్ని ఆటంకాలు ఎదురైనా 'తెలంగాణ రైజింగ్' మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ప్రయాణం ఆగదు' అని ఆయన ధీమా వ్యక్తం చేస్తూ సందేశాన్ని విడుదల చేశారు.

**సీఎం రేవంత్ యూఎస్ పర్యటనకు నో క్లియరెన్స్.. స్పందించిన కేంద్రం**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. దీనిపై విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పందించింది. శుక్రవారం న్యూఢిల్లీలో ఆ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వివరణ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి బ్రిటన్ పర్యటనకు కేంద్రం క్లియరెన్స్ ఇచ్చిందని గుర్తు చేశారు. అయితే సీఎంలు, ఇతర ప్రముఖుల పర్యటనలను.. రాజకీయ క్లియరెన్స్ కోసం అంచనా వేస్తామని ఆయన వివరించారు. ప్రతిపాదిత కార్యక్రమం పదవికి, పర్యటన ఉద్దేశానికి అనుగుణంగా ఉండాలని ఈ సందర్భంగా జైస్వాల్ స్పష్టం చేశారు. అమెరికా పర్యటన అంశంలో అలా లేదన్నారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి యూఎస్ పర్యటనకు క్లియరెన్స్ నిరాకరించామని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఈ నెల 30 వరకు బ్రిటన్, అమెరికాల్లో సీఎం బృందం పర్యటించనుంది. ఈ దేశాల్లోని పలు యూనివర్సిటీలను సందర్శించి విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ సంస్థలతో సంబంధాలు బలోపేతం వంటి అంశాలపై పలు సమావేశాలు, కార్యక్రమాలు జరగనున్నాయి. అలాగే పలు యూనివర్సిటీలను సందర్శించి.. అధికారులతో చర్చించనున్నారు. లండన్‌లోని ఆక్సఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను సీఎం బృందం సందర్శించనుంది. అక్కడి ఎమిరేట్స్ స్టేడియంలో ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో వారు పాల్గొనున్నారు. అనంతరం యూఎస్‌కు సీఎం బృందం బయలుదేరి వెళ్లాల్సి ఉంది. కానీ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో.. సీఎం రేవంత్ లండన్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. అయితే అధికారుల బృందం మాత్రం యూఎస్ పర్యటనకు వెళ్లాలని సీఎం ఆదేశించినట్లు తెలుస్తోంది.

# శోకసంద్రంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలుగు చలనచిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అలనాటి ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి (95) కన్నుమూశారు. గత కొంతకాలంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు చెన్నై లోని కావేరి ఆస్పత్రిలో చేర్పించారు. ఇవాళ మధ్యాహ్నం ఆమె ఆరోగ్యం మరింత విషమించడంతో ఐసీయూలో చికిత్స అందజేస్తుండగా షావుకారు జానకి తదిశ్వాస విడిచారు. అయితే, ఆమె మరణ వార్తను తెలుసుకున్న పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియాలో తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ నివాళు లర్పిస్తున్నారు.

**జానకి నేపథ్యం ఇలా..**

ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో 1931 డిసెంబరు 12న శంకరమంచి జానకి జన్మించారు. ఆమె తండ్రి టి.వెంకోజీరావు పేపర్ పరిశ్రమ నిపుణుడు కాగా, తల్లి శచీదేవి గృహిణి. చిన్ననాటి నుంచే కళలపై ఆసక్తి పెంచుకున్న జానకి, తన 11వ ఏటనే రేడియో నాటికల ద్వారా నటన రంగంలోకి అడుగుపెట్టారు. ఆమెకు 15 ఏళ్లకు వివాహమైనప్పటికీ, నటన పట్ల ఉన్న అభిరుచితో రంగస్థల నాటకాల్లో పలు పాత్రలు పోషిస్తూ తన ప్రయాణాన్ని కొనసాగించారు.

**'షావుకారు' చిత్రంతో వెండితెరకు పరిచయం..**

విజయా ప్రొడక్షన్స్ నిర్మించిన 'షావుకారు' (1950) చిత్రం ద్వారా జానకి చలనచిత్ర రంగానికి పరిచయమయ్యారు. ఆ సినిమా అనూహ్య విజయం సాధించడమే కాకుండా, ఆమె నటించిన పాత్రకు విశేష ప్రజాదరణ లభించడంతో 'షావుకారు జానకి'గా చిత్రసీమలో స్థిరపడిపోయారు. ఆ తర్వాత తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో కలిపి మొత్తం 380కి పైగా చిత్రాలలో వైవిధ్యమైన పాత్రలు పోషించి మెప్పించారు. ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎంజీఆర్, శివాజీ గణేశన్ వంటి అగ్ర కథానాయకుల సరసన సుమారు రెండు వందలకు పైగా సినిమాల్లో ఆమె కథానాయికగా అలరించారు. 'రోజులు మారాయి', 'మంచి మనసులు', 'డాక్టర్ చక్రవర్తి' వంటి అగ్ర చిత్రాలు ఆమె నటనా పటిమకు నిదర్శనంగా నిలిచాయి. ఇక ఆమె సోదరి కృష్ణకుమారి కూడా సినీ రంగంలో ప్రముఖ నటిగా గుర్తింపు పొందారు. కళారంగానికి ఆమె అందించిన విశేష సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 2022లో ఆమెను ప్రతిష్టాత్మక 'పద్మశ్రీ' పురస్కారంతో సత్కరించింది. వీటితో పాటు అరిజోనా విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్న ఆమె, జాతీయ ఫిల్మ్ అవార్డులు, తెలుగు సినిమా అవార్డుల కమిటీల్లో జ్యూరీ సభ్యురాలిగా కూడా సేవలు అందించారు.

# హైదరాబాద్‌లో ప్రైవేట్ స్థలాలు ఎన్ని?

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** 22ఏ కింద నిషేధిత జాబితాలో చూపుతున్న లక్షలాది మంది నిరుపేదల నివాసాలు, ఖాళీ స్థలాలతో పాటు పెద్ద పెద్ద భవనాలను ఆ జాబితా నుంచి బయటపడేసేందుకు జిల్లా రెవెన్యూ శాఖ చర్యలు తీసుకుంటోంది. ప్రభుత్వ ఆదేశాలతో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో చర్చిస్తూ, రికార్డులను సరిచూస్తున్నారు. ప్రధానంగా రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో సబ్ రిజిస్ట్రార్లు తిరస్కరిస్తున్న సర్వే నంబర్లలో ఉన్న మొత్తం భూమి ఎంత.. అందులో ఎంతవరకు ప్రైవేట్ పట్టా స్థలాలు ఉన్నాయి.. వాటి పక్కన ఉన్న ప్రభుత్వ భూమిలో ఎన్ని కోర్టు కేసులు నడుస్తున్నాయి.. అనే వివరాలను ఆరా తీస్తున్నారు.

**అధికారుల తప్పిదంతో నిషేధిత జాబితాలోకి..**

రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని నెలలుగా 22ఏ సెక్షన్ తీవ్ర చర్చనీయాంశంగా మారిన విషయం తెలిసిందే. ప్రభుత్వ భూముల పరిరక్షణ పేరుతో తీసుకొచ్చిన ఈ చట్టంతో 50 ఏళ్లకు పైబడిన ప్రైవేట్ పట్టా భూములు, ఇళ్లు సైతం అనుకోకుండా ప్రోహిబిటెడ్ లిస్టులోకి వెళ్లాయి. అయితే కొంతమంది రెవెన్యూ అధికారుల తప్పిదంతోనే ఈ పొరపాట్లు చోటుచేసుకున్నాయని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజులుగా దిద్దుబాటు చర్యలకు దిగింది. రాష్ట్రంలో ఇతర జిల్లాల్లో ఈ సమస్య తక్కువగా ఉన్నప్పటికీ, గ్రేటర్‌లోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌లో ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**నివేదిక ఇచ్చేందుకు హడావుడి**

వాస్తవంగా జిల్లాలో 12 లక్షలకు పైగా భూములు వివిధ కోర్టు కేసుల్లో ఉన్నాయి. ఏళ్ల తరబడి ఇవి కోర్టుల్లో నడుస్తూనే ఉన్నాయి. కౌంటర్లు దాఖలు చేయడంలో కొంతమంది తహసీల్దార్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో మగ్గుతున్నాయి. దీంతో కొంత మంది వాటిని ఆక్రమించుకుని పట్టాలు సైతం పొందుతున్నారనే ఆరోపణలున్నాయి. ఈ తరుణంలో మండలాల వారీగా అసలు కోర్టు కేసులు ఎన్ని ఉన్నాయి.. వాటి ప్రస్తుత పరిస్థితిని తెలియజేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేయడంతో కొందరు హడావుడి పడుతున్నారు. కోర్టులకు వెళ్లకపోవడంతో సమగ్ర సమాచారం లేకపోవడంతో పరేషాన్ అవుతున్నారు.

**సబ్ రిజిస్ట్రార్లతో సంప్రదింపులు**

22ఏపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిన తరుణంలో జిల్లాలోని తహసీల్దార్లు.. తమ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లతో సంప్రదింపులు జరుపుతున్నారు. అన్నింటినీ తిరస్కరించి ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని, సరిగా ఉన్న వాటికి బై నంబర్లు ఇస్తామని, అప్పటివరకు ఓపిక పట్టాలని కోరుతున్నారు. ఇదే సమయంలో రోజవారీ ప్రక్రియను కూడా తెలుసుకుని కలెక్టర్‌కు నివేదిక అందజేస్తున్నారు. మొత్తంగా 22ఏపై జిల్లా రెవెన్యూ అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు.

**హైదరాబాద్‌లో 3,288.16 ఎకరాలు**

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో 3,288.16 ఎకరాల అర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్‌సీ) భూములు ఉన్నాయి. అలాగే సుమారు 15 వేల ఎకరాల్లో దేవాదాయ, వక్ఫ్ భూములు 7వేల ఎకరాలకు పైగా ఉన్నాయి. ఆయా భూముల పక్కన ప్రైవేట్ వ్యక్తుల స్థలాలు కూడా పెద్ద ఎత్తున ఉన్నాయి. అయితే కొద్ది నెలల క్రితం జరిగిన భూసవరణ ప్రక్రియలో 22ఏ కింద ఉన్న అసైన్డ్, 22బీ కింద ఉన్న స్టేట్ అండ్ సెంట్రల్, 22సీ కింద ఉండే దేవాదాయ/వక్ఫ్‌బోర్డు, 22డీ కింద ఉండే అగ్రికల్చర్/అర్బన్ ల్యాండ్ సీలింగ్, 22ఈ కింద ఉన్న కోర్టు కేసు పక్కన ఉన్న పట్టా భూముల్లో కొన్ని నిషేధిత జాబితాలో పడడంతో సమస్య మొదలైంది. ఇదిలా ఉండగా, బంజారాహిల్స్‌లోని ఎమ్మెల్యే కాలనీ మొత్తం కూడా 22ఏ ప్రొహిబిటెడ్ లిస్టులో ఉన్నట్లు తెలిసింది. ఇందులో ఓ మాజీ ముఖ్యమంత్రి ఇల్లు కూడా ఉండడంతో ఆయన విషయాన్ని ఇటీవల ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ లాంటి ప్రాంతాలతో పాటు ఇతర చోట్ల 22ఏ పక్కన ఉన్న పట్టాభూముల లెక్కలు తేల్చాలని సర్కారు ఆదేశించడంతో రెవెన్యూ అధికారులు పరుగులు పెడుతున్నారు.

# బేగంపేటను ముంచెత్తిన ఫ్లెక్సీల హంగామా..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హైదరాబాద్ పర్యటన తెలంగాణ రాజకీయ వర్గాల్లోనూ, ఆయన అభిమానుల్లోనూ విశేష ఆసక్తిని రేకెత్తిస్తోంది. హైదరాబాద్‌లోని జలవిహార్‌లో మధ్యాహ్నం జరగనున్న ఒక వివాహ మహోత్సవానికి హాజరయ్యేందుకు ఆయన నగారానికి చేరుకుంటున్నారు. జగన్ రాకను పురస్కరించుకుని ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు బీఆర్ఎస్ పార్టీకి చెందిన స్థానిక నాయకులు నగరంలో అడుగడుగునా ఘన స్వాగత ఏర్పాట్లు చేశారు. శేరిలింగంపల్లికి చెందిన బీఆర్ఎస్ నేత చిర్రా రవీందర్ యాదవ్ ఆధ్వర్యంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి జలవిహార్ వరకు ప్రధాన మార్గాల్లో భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ స్వాగత ఏర్పాట్లలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్న అంశం ఏంటంటే, వైఎస్ జగన్‌తో పాటు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చిత్రాలను ఒకే కటౌట్‌లో పొందుపరచడం. 'ధీరుడు వైఎస్ జగన్‌కు స్వాగతం', 'వజ్రం ఎక్కడ ఉన్నా మెరుస్తుంది' అనే ఆకట్టుకునే నినాదాలతో కూడిన ఈ బ్యానర్లు నగరంలో వెలిసి రాజకీయ వర్గాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. గతంలో తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న రాజకీయ సంబంధాలు, సమీకరణాలను ప్రతిబింబించేలా ఈ కటౌట్లు ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. బేగంపేట, పంజాగుట్ట, రాజ్‌భవన్ రోడ్డు, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో ఈ భారీ ఫ్లెక్సీలు అటుగా వెళ్లే బాటసారులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. కేవలం వ్యక్తిగత శుభకార్యానికి హాజరుకావడానికే వచ్చినప్పటికీ, విపక్ష నాయకులు జగన్‌కు ఈ స్థాయిలో స్వాగత ఏర్పాట్లు చేయడం విశేషం. ఏపీలో అధికారం కోల్పోయిన తర్వాత జగన్ హైదరాబాద్ రావడం, ఆయనకు బీఆర్ఎస్ నాయకులు మద్దతుగా కటౌట్లు ఏర్పాటు చేయడం వెనుక ఉన్న రాజకీయ కోణాలపై విశ్లేషణలు సాగుతున్నాయి. జగన్ రాక సందర్భంగా బేగంపేట విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో అభిమానులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో పోలీసులు భద్రతా చర్యలను పర్యవేక్షిస్తున్నారు. మొత్తంమీద జగన్ నగర పర్యటన ఒక శుభకార్యానికి సంబంధించినదే అయినప్పటికీ.. నగరంలో కనిపించిన స్వాగత తోరణాలు, కటౌట్లు రెండు రాష్ట్రాల రాజకీయాల్లో సరికొత్త వాతావరణాన్ని తీసుకొచ్చాయి.



# జీవో 150తో నీట్ విద్యార్థులకు అన్యాయం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర ప్రభుత్వం అనాలోచితంగా తెచ్చిన జీవో 150తో నీట్ అభ్యర్థులు, వారి తల్లితండ్రులు ఆందోళనలో ఉన్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. నీట్ అభ్యర్థుల పేరెంట్స్ శుక్రవారం కవితను కలిశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. వారంతా ఇప్పటికే ధర్నాలు, ఆందోళనలు చేస్తున్నారని.. కేవలం నాలుగేళ్లు ఇక్కడ చదివితే చాలు స్థానికులుగా పరిగణించేలా జీవో తేవడం తెలంగాణ విద్యార్థులకు అన్యాయం చేయటమేనని అన్నారు. తెలంగాణ తెచ్చుకున్నదే తెలంగాణ భవిష్యత్ తరాలకు న్యాయం కోసమని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని డిమాండ్ చేశారు. జీవో 150 కారణంగా మెడిసిన్‌లో 1600 సీట్లు బయటవాళ్లకు పోయే పరిస్థితి వచ్చిందన్నారు. తెలంగాణ బిడ్డల కోసం ఏర్పాటు చేసిన మెడికల్ కాలేజ్‌లలో వేరే వాళ్లకు సీట్లు ఇవ్వటం సరికాదని.. ఈ జీవోను వెంటనే రద్దు చేయటం సాధ్యం కాకపోతే అనుబంధంగా జీవోను సవరించాలన్నారు. కనీసం ఏడేళ్లపాటు తెలంగాణలో చదివిన వారికే స్థానికులుగా అవకాశం ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నీట్ కారణంగా 15 శాతం సీట్లు కోల్పోతున్నారని.. తెలంగాణ రక్షణ సేన తరఫున నీట్‌ను తాము వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో మెడికల్ బోర్డు ఉంటేనే విద్యార్థులకు న్యాయం జరుగుతుందని.. సీఎం ఈ విషయంలో వెంటనే స్పందించాలని.. విదేశాల్లో ఉన్నానంటూ పట్టించుకోకపోతే ఊరుకునేది లేదన్నారు.

# షావుకారు జానకి మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర సంతాపం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సినిమా రంగంలో తనకంటూ ప్రత్యేక పేరును సంపాదించుకున్న షావుకారి జానకీ ఈ రోజు కన్నుమూశారు. దక్షిణ భారత చలనచిత్ర పరిశ్రమలో తనదైన నటనతో విశేష ఖ్యాతి గడించి, పద్మశ్రీ పురస్కార గ్రహీతగా మారిన షావుకారు జానకి మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నతనం నుంచే నాటకాల్లో విభిన్న పాత్రలు పోషిస్తూ కళారంగ ప్రవేశం చేసిన ఆమె.. దాదాపు ఏడు దశాబ్దాల పాటు చలనచిత్ర పరిశ్రమలో చెరగని ముద్ర వేశారని సీఎం కొనియాడారు. 'షావుకారు' చిత్రంలో అద్భుతమైన నటనను కనబరిచి ఆ పేరిటే ప్రేక్షకుల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని గుర్తుచేసుకున్నారు. తెలుగు, తమిళం, కన్నడ భాషల్లోనే కాకుండా హిందీ, మలయాళ చిత్రాలతో కలిపి దాదాపు 400కు పైగా చిత్రాల్లో నటించి అశేష ప్రేక్షకాదరణ పొందారని ప్రశంసించారు. షావుకారు జానకి పోషించిన వైవిధ్యభరితమైన పాత్రలు, ఆమె ప్రదర్శించిన భావోద్వేగాలు సినీ చరిత్రలో ఎల్లప్పుడూ నిలిచిపోతాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆమె మరణం భారతీయ సినీ రంగానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత నటి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ.. ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.

# విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** 'సైంటిఫిక్ టెంపర్ డే' సందర్భంగా జన విజ్ఞాన వేదిక తెలంగాణ నల్లగొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జెవివి జిల్లా అధ్యక్షులు గుత్తికొండ సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన మిర్యాలగూడ పట్టణంలోని మహాత్మా జ్యోతిభపూలే బీసీ గురుకుల సంస్థ లో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య వక్తగా కనుకుంట్ల విద్యాసాగర్ రెడ్డి జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు పాల్గొనగా,జె వి వి జిల్లా ఉపాధ్యక్షుడు వాలుగొండ వెంకటేశ్వర్లు సైన్స్ ప్రయోగాలు చేసి చూపించారు. వక్త విద్యాసాగర్ మాట్లాడుతూ శాస్త్రీయ దృక్పథం అంటే ఏ విషయాన్నైనా గుడ్డిగా నమ్మకుండా,ఆలోచించి, ప్రశ్నించి,పరిశీలించి,ఆధారాల ద్వారా నిజాన్ని లుసుకోవడం."ఎందుకు?","ఎలా?" అనే ప్రశ్నలు అడగడం శాస్త్రీయ దృక్పథానికి మొదటి మెట్టు. మూఢనమ్మకాలను ప్రశ్నిస్తూ, శాస్త్రీయ ఆలోచనలను పెంపొందించుకోవాలి. మన జీవితంలో శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుంది, దేశం ప్రగతి సాధిస్తుంది. శాస్త్రీయంగా ఆలోచిద్దాం -- మూఢనమ్మకాలను దూరం చేద్దాం -- సమాజాన్ని ముందుకు నడిపిద్దాం అని,పాఠశాల స్థాయి నుంచే పిల్లల్లో ప్రశ్నించే తత్వాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచడం ద్వారా జవాబుదారీతనం ఉన్న సమాజం తయారవుతుంది. అప్పుడు మాత్రమే మానవతా విలువలను పాటించే పౌర సమాజ నిర్మాణం జరుగుతుంది అది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నవీన్ కుమార్,జెవివి జిల్లా ఉపాధ్యక్షులు గంగాధరి భద్రయ్య,జేవివి సోషల్ మీడియా కన్వీనర్ ఒంటెపాక నగేష్,ఉపాధ్యాయులు రవి నాయక్, సతీష్,పలువురు విద్యార్థులు,పాల్గొన్నారు

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# సురేఖను తొలగించాల్సిందే

## సీఎల్పీ వేదికగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఫైర్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ ఆమె కుమార్తె కొండా సుస్మిత వివాదం తీవ్రరూపం దాల్చింది. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీని లక్ష్యంగా చేసుకుని సుస్మిత చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ శాసనసభాపక్ష వేదికగా 20 మందికి పైగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అత్యవసర ప్రెస్ మీట్ నిర్వహించారు. కొండా సురేఖను వెంటనే మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయడంతో పాటు, పార్టీ నుండి కూడా డిస్మిస్ చేయాలని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు.

**కూతురు మాట్లాడితే తల్లికి సంబంధం ఉండదా: బీర్ల ఐలయ్య**

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల తరఫున ప్రభుత్వ చీఫ్ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. "కుమార్తె సుస్మిత చేసిన వివాదాస్పద వ్యాఖ్యలను మంత్రి సురేఖ ఇప్పటివరకు ఖండించకపోవడాన్ని మేమంతా తీవ్రంగా తప్పుబడుతున్నాం. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ కూతురి వ్యాఖ్యలతో తనకు సంబంధం లేదనడం అత్యంత విడ్డూరం. పార్టీలో ఏవైనా అభిప్రాయభేదాలు ఉంటే సీఎల్పీ లేదా పీసీసీ సమావేశాల్లో మాట్లాడాలి తప్ప, ముఖ్యమంత్రిని, పార్టీని ఉద్దేశించి బహిరంగంగా ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం ఏమాత్రం సరికాదు" అని స్పష్టం చేశారు.

**చెట్టు మీద ఉండి ఆ కొమ్మనే నరుకుతున్నారు: వేముల వీరేశం**

నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. కొండా సురేఖ వైఖరిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "సీఎం రేవంత్ రెడ్డిపై ఎవరు తప్పుడు ఆరోపణలు చేసినా అధిష్టానం కఠిన చర్యలు తీసుకోవాలి. పార్టీలోనే ఉంటూ సీఎం నిర్ణయాలను తప్పుబట్టడం అంటే, ఉన్న చెట్టు కొమ్మను తామే నరుక్కున్నట్లే. ఈ తల్లీకూతుళ్ల వ్యాఖ్యలను ఖండించకపోతే ప్రతిపక్షాలకు బలం చేకూర్చినట్లవుతుంది. గతంలో కూడా కొండా సురేఖ నోరుజారి పార్టీకి తలవంపులు తెచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు రాత్రింబవళ్లు కష్టపడ్డారు. సీఎంకు కొండా కుటుంబం వెంటనే క్షమాపణ చెప్పాలి. సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసి, పార్టీ నుంచి డిస్మిస్ చేయాల్సిందే" అని డిమాండ్ చేశారు.

**విపక్షాల కుట్రలను అమలు చేస్తున్నారు: బాలు నాయక్**

దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ.. "సీఎం రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నాం. విపక్షాల కుట్రలను కొండా కుటుంబం కాంగ్రెస్‌లో ఉంటూ అమలు చేస్తోంది. తెలంగాణలో ప్రజాపాలన సాగుతుంటే, కొండా సురేఖ మాత్రం ప్రతిపక్ష నేతలా వ్యవహరిస్తున్నారు. ముఖ్యమంత్రిని వ్యతిరేకించే వారికి కాంగ్రెస్ పార్టీలో కొనసాగే అర్హత ఎంతమాత్రం లేదు. పార్టీ అధిష్ఠానం సురేఖపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలి" అని స్పష్టం చేశారు.

# ఇక అన్నీ బయటపెడతా

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలో తాజా రాజకీయ పరిణామాల వేళ మంత్రి కొండా సురేఖ నివాసంలో మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్‌చాట్ ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రస్తుతం మీడియాలో నడుస్తున్న వివాదాస్పద అంశాలపై స్పందించిన మంత్రి, త్వరలోనే అన్నీ విషయాలను వివరంగా మాట్లాడతానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. "మా ఇంట్లో జరుగుతున్న ప్రత్యేక పూజా కార్యక్రమంలో నేను బిజీగా ఉన్నాను. ఇప్పటికే చెప్పాల్సిన విషయాలన్నీ నిన్ననే స్పష్టంగా మాట్లాడాను. ప్రస్తుతం ఇంకా అదనంగా చెప్పడానికి ఏమీ లేదు. త్వరలోనే పూర్తి వివరాలతో అన్ని నేష విషయాలనూ మీడియా ముందుకు వచ్చి మాట్లాడతాను" అని వ్యాఖ్యానించారు.

**సీఎం వచ్చాకే స్పందిస్తా: సుస్మితా పటేల్**

అనంతరం మంత్రి కుమార్తె కొండా సుస్మితా పటేల్ మాట్లాడుతూ.. తన వ్యాఖ్యలపై క్లారిటీ ఇచ్చారు. "ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. తన పర్యటన నుంచి తిరిగి వచ్చిన తర్వాత అన్ని విషయాల గురించి మాట్లాడతాను. అప్పటి వరకు ఎలాంటి వ్యాఖ్యలు చేయను. త్వరలోనే నేను కూడా అన్ని వివరాలనూ తప్పకుండా మాట్లాడతాను" అని మీడియా ప్రతినిధులకు తెలిపారు. ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో మంత్రి సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత చేసిన ఈ వ్యాఖ్యలు పార్టీ వర్గాల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

# చక్కెర ధరల భగభగ

**-న్యూ ఢిల్లీ :** దేశంలో చెరుకును ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించడం వల్ల చక్కెర సంక్షోభం తలెత్తింది. దేశంలో తగినంత చెరుకు దిగుబడి ఉన్నప్పటికీ.. మోడీ ప్రభుత్వం ఇథనాల్ ఉత్పత్తి వెనుక పడటంతో దేశీయంగా చక్కెర నిల్వలు తగ్గి ధరలు రికార్డు స్థాయికి తగ్గాయి. పండుగ సీజన్ సమీపిస్తున్న వేళ ధరల నియంత్రణ కోసం చక్కెర దిగుమతుల వైపు కేంద్ర ప్రభుత్వం మొగ్గుచూపింది. దేశీయంగా రేట్ల పెరుగుదలను అదుపుచేసేందుకు 100 శాతం దిగుమతి సుంకాన్ని ఎత్తివేస్తూ నిర్ణయం కూడా తీసుకుంది. అయితే ఇది మోడీ సర్కార్ అనాలోచిత నిర్ణయాల వల్ల ఏర్పడిన పరిస్థితి అని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి.

**కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ విమర్శలు..**

20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ విధానంపై కాంగ్రెస్ నేత జైరామ్ రమేష్ మోడీ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. క్రూడ్ దిగుమతుల బిల్ తగ్గిస్తామంటూ మోడీ సర్కార్ అవలంబిస్తున్న విధానం వల్ల సామాన్యులపై ఆహార పదార్థాలు, ప్రయాణ ఖర్చుల భారం విపరీతంగా పెరిగిపోయిందని ఆరోపించారు. చెరుకు, ధాన్యాలను ఇథనాల్ కోసం మళ్లించడం వల్ల మార్కెట్లో వాటి కొరత ఏర్పడి చక్కెర ధరలు కిలో రూ.48 నుంచి రూ.67కి, బెల్లం ధర రూ.50 నుంచి రూ.65కి పెరిగిందని అన్నారు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ.. ఇథనాల్ బ్లెండింగ్ ద్వారా ఖర్చులు తగ్గినా పెట్రోల్ ధరలను ఎందుకు తగ్గించలేదని మోడీ ప్రభుత్వాన్ని నిలదీశారు.

**అరవింద్ కేజ్రీవాల్..**

ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ సైతం కేంద్ర ప్రభుత్వ ఇథనాల్ విధానాన్ని తప్పుబట్టారు. విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయడానికి చెరుకు నుంచి ఇథనాల్ తయారు చేయాలని చూసి.. ఇప్పుడు దేశీయంగా చక్కెర కొరత సృష్టించి మళ్లీ విదేశాల నుంచే చక్కెర దిగుమతి చేసుకునే స్థితికి వచ్చారని విమర్శించారు. ప్రభుత్వం తీసుకుంటున్న అనాలోచిత నిర్ణయాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఈ20 విధానాన్ని ప్రశ్నించే వారి గొంతును అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు.


**కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పందన..**

ఇదే క్రమంలో వాహనాల మైలేజీ తగ్గిపోవడానికి కేవలం ఈ20 పెట్రోల్ మాత్రమే కారణం కాదని కేంద్ర పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. డ్రైవింగ్ అలవాట్లు, ట్రాఫిక్ పరిస్థితులు, వాహనాల నిర్వహణ, టైర్లలో గాలి పీడనం, ఏసీ వాడకం వంటి అంశాలు కూడా ఇంధన సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయని తెలిపింది. విస్తృతమైన పరీక్షల తర్వాతే ఈ20 విధానాన్ని తెచ్చామన్నారు.

**జనం మదిలోని మాట..**

మట్నత్తానికి ఇథనాల్ కలిపి నాలుగు డాలర్లు మిగులుస్తాం అంటూ మోడీ సర్కార్ చెప్పిన మాటలు ఇప్పుడు ప్రజలకు కొత్త కష్టాలను తెచ్చిపెడుతున్నాయి. ఇప్పటికే ఈ20 పెట్రోల్ కారణంగా వాహనాలకు రిపేర్లు పెరిగి జేబులకు చిల్లుపడుతోంటే.. అదే ఇథనాల్ కారణంగా ఆహార పదార్థాల కొరత, రేట్లు పెరుగుల రావటం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. ఒకపక్క ఉద్యోగాలు పోతూ రేట్లు పెరుగుతూ ఖర్చుల భారంతో సతమతం అవుతున్నామని వాపోతున్నారు జనం. క్రూడ్ ఆయిల్ రేట్లు తగ్గినప్పటికీ ఇథనాల్ మిక్సింగ్ ఆపకపోవటం.. చక్కర లేక అదే డాలర్లు పెట్టి విదేశాల నుంచి దిగుమతులు చేసుకోవటం ఏంటని, దీనివల్ల విదేశీ మారక నిల్వలు ఎక్కడ సేవ్ అవుతున్నాయ్ అంటూ ప్రశ్నిస్తున్నారు జనం. క్రూడ్ ఆయిల్ కంటే ఆహారపదార్థాల ధరలే ఎక్కువగా ఉండటంతో ఫారెక్స్ ఖర్చులు తగ్గకపోగా పెరుగుతున్నాయ్ మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా సరైన నిర్ణయాలు తీసుకోవాలని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# పెండింగ్ భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలి





**జనగామ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** భూసేకరణ కోసం రూ. 2,800 కోట్లు విడుదలకు ముఖ్యమంత్రి ఆమోదం కొత్త ఆయకట్టు సృష్టించేలా భూసేకరణ, పునరావాస పనుల్లో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలి జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణపై సమీక్ష నిర్వహించిన రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సజావుగా కొనసాగేందుకు ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం, హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఈ వీడియో సమావేశానికి హాజరయ్యారు. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. నీటిపారుదల ప్రాజెక్టుల పనులు సకాలంలో పూర్తయ్యేందుకు పెండింగ్ భూసేకరణను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. పెండింగ్ భూసేకరణ కోసం ప్రభుత్వం వెంటనే రూ. 2,800 కోట్లు విడుదల చేసిందని, ఇందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారని పేర్కొన్నారు. కొత్త ఆయకట్టు సృష్టించేందుకు వీలుగా పెండింగ్ భూసేకరణ, పునరావాస పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. భూసేకరణకు అవసరమైన నిధులు అందుబాటులో ఉన్నందున ఎక్కడా జాప్యం లేకుండా ప్రక్రియను పూర్తి చేసి, ప్రాజెక్టుల పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నీటిపారుదల శాఖ ఎస్ఈ సీతారాం, తదితరులు పాల్గొన్నారు.



# పెల్లెట్ గన్ ఫైర్ వివాదం..

**న్యూ ఢిల్లీ :** నీట్ నిరసనల్లో భాగంగా పార్లమెంటు ముట్టడికి ప్రయత్నించిన సందర్భంగా జరిగిన పెల్లెట్ గన్ దాడిలో ఓ విద్యార్థి తీవ్రంగా గాయపడ్డాడు. కాగా ఆ బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పార్లమెంట్ స్ట్రీట్ (సంసద్ మార్గ్) పోలీస్ స్టేషన్‌లో చేపట్టిన నిరసన ఫలించింది. ఈ రోజు ఉదయం బాధితుడైన సాహిల్ లోచబ్ తో కలిసి ఆయన ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, పోలీసులు కేసు నమోదుకు నిరాకరించడంతో రాహుల్ గాంధీ అక్కడే ధర్నాకు దిగారు. దాదాపు ఎనిమిది గంటల పాటు ఉదయం 11:30 నుంచి సాయంత్రం వరకు స్టేషన్ ప్రాంగణంలోనే ఉండి, అక్కడే ఆహారం తీసుకుంటూ పట్టువీడకుండా బైఠాయించడంతో ఎట్టకేలకు పోలీసులు బాధ్యులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కేసు నమోదైన అనంతరం మీడియాతో మాట్లాడిన రాహుల్ గాంధీ, ఇది న్యాయం దిశగా పడిన మొదటి అడుగు మాత్రమేనని వ్యాఖ్యానించారు. తుపాకీ కాల్పులు జరిగి నెల రోజులు గడుస్తున్నా బాధితుడి శరీరంలో ఇప్పటికీ అనేక పెల్లెట్లు మిగిలే ఉన్నాయని, కంటిలో మూడు పెల్లెట్లు ఉండటంతో చూపు కోల్పోయాడని, గుండె సమీపంలోనూ మరికొన్ని ఉన్నాయని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. దేశ రాజధాని నడిబొడ్డున ఉన్న పోలీస్ స్టేషన్‌లోనే ఒక సాధారణ పౌరుడిపై జరిగిన దాడికి ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి ఎనిమిది గంటల సమయం పట్టిందని, కేంద్ర హోం కార్యదర్శి, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కార్యాలయం నుంచి ఆమోదం వచ్చేంతవరకు పోలీసులు బ్రేకులు వేశారని ఆయన ఆరోపించారు. దేశంలో సామాన్యులకు న్యాయం దక్కకుండా పై స్థాయి నుంచే ఆటంకాలు ఎదురవుతున్నాయని ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

# గంజాయి మత్తులో టీచర్‌పై కత్తులతో దాడి..



**నల్లగొండ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఇటీవల నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గంలో కొండమల్లేపల్లిలో 10వ తరగతి విద్యార్థులు గంజాయి మత్తులో హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రూపారెడ్డి పై విచక్షణ రహితంగా కత్తులతో దాడి చేసి, చంపినట్లు వెలువడుతున్న వార్తలు అత్యంత ఆందోళనకరమైనవని బిఎస్పీ పార్టీ భువనగిరి పార్లమెంట్ ఇన్చార్జి కత్తుల కాన్షీరామ్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కత్తుల కాన్షీరామ్ మాట్లాడుతూ, ఈ ఘటనను బహుజన సమాజ్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఉపాధ్యాయురాలిపై ఇంత దారుణమైన దాడి జరిగే పరిస్థితి ఏర్పడిందంటే, ఇది కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడిగా చూడటం సరికాదని, ఇది రాష్ట్రంలో డ్రగ్స్ వ్యాప్తి, యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం, పాఠశాలల భద్రతపై ప్రభుత్వం వెంటనే సమాధానం చెప్పాల్సిన తీవ్రమైన సామాజిక సమస్య అని, విద్యార్థుల చేతుల్లో పుస్తకాలు, పెన్నులు ఉండాల్సిన వయసులో గంజాయి, కత్తులు ఎలా చేరుతున్నాయని, పాఠశాలలు, కళాశాలల చుట్టుపక్కల మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న వారిపై నిఘా ఎక్కడ ఉందని, విద్యార్థులకు గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులు, ముఠాలు ఎవరు? వారి వెనుక ఎవరున్నారు? చిన్న వయస్సు పిల్లలకు డ్రగ్స్ చేరుతున్నా సంబంధిత వ్యవస్థలు ఎందుకు ముందుగానే గుర్తించలేకపోతున్నాయి అని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం "డ్రగ్స్‌పై ఉక్కుపాదం" అంటూ ప్రకటనలు చేయడం కాదని, క్షేత్రస్థాయిలో ఫలితాలు చూపించాలని, ప్రతి పాఠశాల, కళాశాల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, డ్రగ్స్ సరఫరా చేసే నెట్‌వర్క్‌ను గుర్తించి మూలాలతో సహా కట్టడి చేయాలని, అదేవిధంగా ఈ ఘటనపై పక్షపాతం లేకుండా సమగ్ర దర్యాప్తు జరిపి, అసలు కారణాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. నిందితులు ఎవరైనా, ఎంతటి ప్రభావం ఉన్నవారైనా చట్టం ముందు నిలబెట్టి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి బీఎస్పీ డిమాండ్లు చేశారు. ఈ ఘటనపై తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపి నిజానిజాలను ప్రజల ముందుంచాలని, విద్యాసంస్థల పరిసరాల్లో గంజాయి, డ్రగ్స్ విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్న వ్యక్తులు, ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్‌కు బానిసలవుతున్న విద్యార్థులకు కౌన్సెలింగ్, వైద్య సహాయం, పునరావాస కార్యక్రమాలు అందించాలని, ప్రతి పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల భద్రత కోసం ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని, రాష్ట్రవ్యాప్తంగా "డ్రగ్స్ రహిత విద్యాసంస్థలు" కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలన్నారు. పిల్లల భవిష్యత్తును డ్రగ్స్ మాఫియా చేతుల్లోకి వెళ్లనివ్వకూడదని, ఉపాధ్యాయులపై దాడులు జరిగే పరిస్థితిని సహించకూడదన్నారు. యువతను మాదకద్రవ్యాల నుంచి రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని, విద్యార్థులకు భద్రమైన విద్యా వాతావరణం కల్పించడం ప్రభుత్వ కర్తవ్యం అని, ఈ బాధ్యత నుంచి ప్రభుత్వం తప్పించుకుంటే బహుజన సమాజ్ పార్టీ ప్రజల పక్షాన నిలబడి రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో బిఎస్పీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీపై సీజేపీ చీఫ్ అభిజీత్ ఫైర్



**న్యూ ఢిల్లీ :** రాజస్థాన్‌లోని జైపూర్‌లో కాక్రోచ్ జనతా పార్టీ సభ్యులపై జరిగిన దాడి ఘటనపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే తీవ్రంగా స్పందించారు. ఆశుతోష్, ఆయన బృందంపై దాడి చేయడం బీజేపీ భయానికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. గోశాలలో నడుస్తున్నట్లు చెబుతున్న ఒక ప్రభుత్వ పాఠశాల దుస్థితిని బయటపెట్టేందుకు పరిశీలనకు వెళ్లిన ఆశుతోష్, ఆయన బృందంపై దాడికి తెగబడ్డారని దిప్కే తెలిపారు. "పేద పిల్లలు చదువుకునే పాఠశాలలు మెరుగుపడితే, ప్రజలు తమ ప్రభుత్వాన్ని ప్రశ్నించడం ప్రారంభిస్తారని బీజేపీ భయపడుతోంది. పాఠశాల దుస్థితిని వెలికితీసేందుకు వెళ్లిన బృందంపై రాళ్లదాడి చేశారు. వాహనాలను ధ్వంసం చేశారు. ఈ ఘటనలో ఒక వాలంటీర్ తీవ్రంగా గాయపడ్డారు" అని ఆయన వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సదుపాయాలైన తాగునీరు, బాత్రూములు లేనప్పుడు ఎవరికీ పట్టదని, కానీ ప్రభుత్వ వైఫల్యాలను ఎవరైనా ఎత్తిచూపితే మాత్రం వెంటనే దాడులకు తెగబడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దాడి ఘటనలు ఎదురైనప్పటికీ, పేద పిల్లల మెరుగైన భవిష్యత్తు కోసం, పాఠశాలల వసతుల కల్పన కోసం తమ పోరాటం కొనసాగుతుందని అభిజీత్ దిప్కే స్పష్టం చేశారు.

# మంత్రి వాకిడి శ్రీహరి సమక్షంలో బీజేపీ నుంచి కాంగ్రెస్ లోకి భారీ చేరికలు



**నర్వ,ఫ్లాష్ ఇండియా :** మండల పరిధిలోని యాంకి గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు సర్పంచులు వార్డ్ మెంబర్లు భారీగా కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. మంత్రి వాకిటి శ్రీహరి సర్పంచులను వార్డు మెంబర్లను కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. యాంకి గ్రామానికి చెందిన సర్పంచ్ కళ్యాణి, వెంకటన్న, మాజీ ఉపసర్పంచ్ ఉప్పరి రమేష్ వార్డు సభ్యులు సహా 30 మంది కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా నూతనంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై విశ్వాసంతో ప్రజా సంక్షేమం గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ఇకపై కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. నర్వ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిసం చెన్నయ్య సాగర్ మాట్లాడుతూ.. యాంకికు గ్రామంలో చోటు చేసుకున్న భారీ చేరికలతో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమైందన్నారు రానున్న రోజుల్లో మరింత మంది నాయకులు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

## సంపాదకీయం

# పిల్లల భద్రతను పణంగా పెట్టొద్దు

### ఒక్క ఫొటోలోనే ఎంతో సమాచారం
### లైవ్ లొకేషన్ కూడా ప్రమాదమే
### కృత్రిమ మేధస్సుతో కొత్త ముప్పులు

పసిపాప తొలి అడుగు.. ముద్దుముద్దు మాటలు.. తొలిసారి నవ్విన క్షణం.. పాఠశాలకు వెళ్లిన తొలిరోజు.. చిన్నారి అల్లరి.. పుట్టినరోజు వేడుక.. పరీక్షల్లో మంచి మార్కులు.. ఇలా పిల్లల జీవితంలో ప్రతి చిన్న మధుర జ్ఞాపకాన్ని ఫొటోలు, వీడియోలుగా భద్రపరచుకోవడం తల్లిదండ్రులకు సహజం. అయితే ఆ జ్ఞాపకాలను వెంటనే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల్లో ప్రపంచంతో పంచుకోవాలనే ఆతృత ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. లైకులు, కామెంట్లు, ప్రశంసల కోసం పిల్లల ప్రతి కదలికను బహిరంగం చేస్తున్న తల్లిదండ్రులు.. ఆ సమాచారం ఎవరి చేతుల్లోకి వెళుతుంది? ఎలా ఉపయోగించబడుతుంది? అనే విషయాలను తప్పక ఆలోచించాలి. పిల్లలపై ప్రేమను చూపించే క్రమంలోనే వారి భద్రతకు ముప్పు తెచ్చే పరిస్థితి రాకూడదు.

**ఒక్క ఫొటోలోనే ఎంతో సమాచారం**

డిజిటల్ యుగంలో ఒక ఫొటో కేవలం ఫొటో కాదు. దాని వెనుక ఎంతో సమాచారం దాగి ఉంటుంది. పిల్లలు ఏ పాఠశాలలో చదువుతున్నారు? ఏ యూనిఫాం ధరిస్తున్నారు? ఏ బస్సులో ప్రయాణిస్తున్నారు? ఎప్పుడు స్కూల్‌కు వెళ్తున్నారు? సాయంత్రం ఎక్కడ ఆడుకుంటున్నారు? వంటి వివరాలను తల్లిదండ్రులు తెలియకుండానే పోస్టుల ద్వారా వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా స్కూల్ యూనిఫాంలో ఉన్న ఫొటోల్లో పాఠశాల పేరు, లోగో, బస్సు నంబర్ స్పష్టంగా కనిపిస్తే పిల్లల ఆచూకీ తెలుసుకోవడం సులభమవుతుంది. అలాగే 'ఈరోజు మా పాప ఈ పార్కులో ఆడుకుంటోంది', 'ప్రతిరోజూ సాయంత్రం ఈ ట్యూషన్‌కు వెళ్తుంది' అంటూ నిరంతరం పోస్టులు పెట్టడం ద్వారా పిల్లల రోజువారీ కదలికలకు సంబంధించిన సమాచారం బయటకు వెళ్తుంది. ఒక్కో పోస్టు విడిగా చూస్తే ప్రమాదం కనిపించకపోవచ్చు. కానీ అనేక పోస్టులను కలిపి చూస్తే ఒక చిన్నారి రోజువారీ జీవన విధానం మొత్తం ఎవరికైనా అర్థమయ్యే అవకాశం ఉంది.

**లైవ్ లొకేషన్ కూడా ప్రమాదమే**

ఎక్కడికి వెళ్లినా వెంటనే లొకేషన్ ట్యాగ్ చేయడం నేటి తరం సాధారణ అలవాటుగా మారింది. అయితే పిల్లల విషయంలో ఇది మరింత జాగ్రత్తగా ఉండాల్సిన విషయం. వారు ప్రస్తుతం ఎక్కడ ఉన్నారో తెలియజేసే లైవ్ లొకేషన్, పాఠశాల, పార్క్, ట్యూషన్ కేంద్రం వంటి ప్రదేశాల వివరాలను బహిరంగంగా పంచుకోవడం అపరిచితులకు అనవసరమైన సమాచారాన్ని అందిస్తుంది. సామాజిక మాధ్యమాల్లోని సమాచారాన్ని నేరగాళ్లు పరిశీలించి రెక్కీ నిర్వహించే అవకాశాన్ని తక్కువగా అంచనా వేయకూడదు. భౌతికంగా నిఘా పెట్టాల్సిన అవసరం లేకుండా డిజిటల్ ప్రపంచం నుంచే ఒక కుటుంబం గురించి వివరాలు సేకరించే పరిస్థితి ఏర్పడింది. అందుకే పిల్లల భద్రత విషయంలో 'ఏమీ జరగదు' అనే నిర్లక్ష్య ధోరణి ప్రమాదకరం.

**కృత్రిమ మేధస్సుతో కొత్త ముప్పులు**

సైబర్ ప్రపంచంలో మరో పెద్ద ప్రమాదం కృత్రిమ మేధస్సు ఆధారిత ఫొటో, వీడియో మార్ఫింగ్. సామాజిక మాధ్యమాల్లో బహిరంగంగా లభించే పిల్లల ఫొటోలను దుర్వినియోగం చేసి నకిలీ చిత్రాలు, వీడియోలు రూపొందించే అవకాశం ఉంది. సాధారణ ఫొటోను కూడా అనుచిత కంటెంట్‌గా మార్చే సాంకేతిక సామర్థ్యం ఇప్పుడు అందుబాటులో ఉంది. ఇలాంటి కంటెంట్ ఒకసారి ఇంటర్నెట్‌లో వ్యాపిస్తే దాన్ని పూర్తిగా తొలగించడం చాలా కష్టం. ఇది కేవలం సాంకేతిక సమస్య కాదు.. ఒక కుటుంబం ఎదుర్కొనే తీవ్రమైన మానసిక, సామాజిక సమస్య. అందుకే పిల్లల ఫొటోలను ఎక్కడ, ఎవరితో, ఎంతవరకు పంచుకోవాలనే విషయంలో తల్లిదండ్రులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి.

**'ప్రైవేట్ అకౌంట్' అనే భ్రమ వద్దు**

చాలామంది తమ సోషల్ మీడియా ఖాతా ప్రైవేట్‌గా ఉందని, కేవలం స్నేహితులు మాత్రమే ఫొటోలు చూస్తారని భావిస్తారు. కానీ ఇంటర్నెట్‌లో గోప్యత పూర్తిగా మన చేతుల్లో ఉండదు. మన ఫాలోవర్లలో ఒక్కరు స్క్రీన్‌షాట్ తీసినా, ఫొటోను డౌన్‌లోడ్ చేసినా అది మన నియంత్రణ దాటి వెళ్లిపోతుంది. అక్కడి నుంచి మరొకరికి, మరో గ్రూప్‌కు, చివరకు తెలియని వ్యక్తుల చేతుల్లోకి చేరే ప్రమాదం ఉంటుంది. ఒకసారి ఆన్‌లైన్‌లోకి వెళ్లిన సమాచారం ఎక్కడికి చేరుతుందో చెప్పలేం. అందుకే 'నా అకౌంట్ ప్రైవేట్ కాబట్టి సమస్య లేదు' అనే భావనను తల్లిదండ్రులు విడిచిపెట్టాలి.

**పిల్లల గోప్యతను గౌరవించాలి**

పిల్లలు చిన్నవాళ్లు కాబట్టి వారి జీవితంలోని ప్రతి విషయాన్ని తల్లిదండ్రులు నిర్ణయించాల్సి ఉంటుంది. కానీ అందుకు వారి వ్యక్తిగత జీవితాన్ని ప్రపంచానికి ప్రదర్శించడం అవసరం లేదు. ముఖ్యంగా పిల్లలు దుస్తులు లేకుండా ఉన్నప్పుడు, స్నానం చేస్తున్నప్పుడు లేదా ఇతర ప్రైవేట్ పరిస్థితుల్లో ఉన్న ఫొటోలను ఎట్టి పరిస్థితుల్లోనూ సోషల్ మీడియాలో పెట్టకూడదు. తల్లిదండ్రులకు అవి ముద్దైన జ్ఞాపకాలుగా కనిపించినా, దురుద్దేశంతో చూసేవారికి అవి ప్రమాదకరమైన కంటెంట్‌గా మారవచ్చు. పిల్లల పూర్తి పేరు, పుట్టిన తేదీ, పాఠశాల, ఇంటి పరిసరాలు, రోజువారీ అలవాట్లు వంటి వ్యక్తిగత సమాచారాన్ని కూడా అవసరం లేకుండా బహిరంగం చేయకూడదు. పిల్లల డిజిటల్ గుర్తింపు వారి భవిష్యత్తుతో ముడిపడి ఉంటుందని గుర్తించాలి.

**జాగ్రత్తే నిజమైన ప్రేమ**

పిల్లల విజయాలను, ఆనందాలను పంచుకోవడం తప్పు కాదు. కానీ పంచుకునే సమాచారానికి హద్దులు ఉండాలి. తల్లిదండ్రులు తమ సోషల్ మీడియా గోప్యతా సెట్టింగులను పరిశీలించాలి. అవసరం లేని ఫాలోవర్లను తొలగించాలి. పాత పోస్టులను కూడా ఒకసారి పరిశీలించి పిల్లలకు సంబంధించిన అనవసరమైన వ్యక్తిగత సమాచారాన్ని తొలగించడం మంచిది. అంతేకాదు.. పిల్లలకు కూడా డిజిటల్ భద్రతపై చిన్న వయస్సు నుంచే అవగాహన కల్పించాలి. అపరిచితులతో వ్యక్తిగత సమాచారం పంచుకోకూడదని, తెలియని లింకులు తెరవకూడదని, ఎవరైనా ఫొటోలు అడిగినా తల్లిదండ్రులకు చెప్పాలని నేర్పాలి.

**లైకులు తాత్కాలికం.. భద్రత శాశ్వతం**

సామాజిక మాధ్యమాల్లో వచ్చే లైకులు, కామెంట్లు కొన్ని గంటలు లేదా కొన్ని రోజులు మాత్రమే ఆనందాన్ని ఇస్తాయి. కానీ ఒకసారి బయటకు వెళ్లిన ఫొటో, సమాచారం సంవత్సరాల పాటు ఇంటర్నెట్‌లో ఉండవచ్చు. కాబట్టి తాత్కాలికమైన లైకుల కోసం శాశ్వతమైన ప్రమాదాన్ని కొనితెచ్చుకోవడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. పిల్లలపై ప్రేమను ప్రపంచానికి చూపించాల్సిన అవసరం లేదు. వారి ప్రతి క్షణాన్ని పోస్టు చేయకపోయినా తల్లిదండ్రుల ప్రేమ తగ్గదు. కానీ ఒక నిర్లక్ష్యపు పోస్టు వల్ల ఎదురయ్యే నష్టం మాత్రం జీవితాంతం వెంటాడే అవకాశం ఉంది. అందుకే డిజిటల్ యుగంలో తల్లిదండ్రులు ఒక చిన్న నియమాన్ని పాటించాలి. 'పోస్ట్ చేసే ముందు ఒక్క నిమిషం ఆలోచించాలి.' ఈ ఫొటో వల్ల నా పిల్లల భద్రతకు ఏమైనా ముప్పు ఉందా? ఇందులో వారి పాఠశాల, లొకేషన్, వ్యక్తిగత సమాచారం బయటపడుతోందా? ఈ ఫొటోను భవిష్యత్తులో నా పిల్లలు స్వయంగా చూసినప్పుడు సంతోషిస్తారా? అనే ప్రశ్నలకు సమాధానం దొరికిన తర్వాతే పోస్టు చేయాలి. పిల్లల బాల్యం సామాజిక మాధ్యమాల ప్రదర్శన కాదు. వారి నవ్వులు, వారి అల్లరి, వారి జ్ఞాపకాలు వారికి సురక్షితంగా మిగలాలి. లైకుల కోసం పిల్లల గోప్యతను కాదు.. వారి భవిష్యత్తును కాపాడుదాం. పిల్లల ప్రతి క్షణాన్ని ప్రపంచానికి చూపించడం కంటే, ప్రతి క్షణాన్ని భద్రంగా ఉంచడమే తల్లిదండ్రుల అసలైన బాధ్యత.

# బీజేపీ కొత్త వ్యూహాలు..!

దేశ రాజకీయాల్లో పుష్కర కాలంగా ఆధిపత్యం ప్రదర్శిస్తున్న బీజేపీ.. మోడీ హయాంలో మొదట్నుంచీ యువతను ఆకట్టుకోవడంలో మిగతా పార్టీల కంటే ముందే ఉంది. 2014 నుంచి మొన్నటి సార్వత్రిక ఎన్నికల వరకూ యువ ఓటర్ల ఓటింగ్ చూసినా కూడా మొగ్గు బీజేపీ వైపే ఉంది. కానీ ఇటీవల జంతర్ మంతర్ దగ్గర యువత ఆందోళనలు.. తర్వాతి పరిణామాలతో.. ఎక్కడో జెన్‌జీతో పార్టీకి గ్యాప్ వచ్చిందని బీజేపీ గ్రహించింది. దీంతో ఎక్కువ ఆలస్యం చేయకుండా వెంటనే దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఆ మాటకొస్తే బీజేపీ రాజకీయ ప్రస్థానంలో పొరపాట్ల నుంచి వేగంగా నేర్చుకునే సంస్కృతి ఇమిడి ఉంది. బీజేపీలో జాతీయ స్థాయి అగ్రనేతగా ఎవరున్నా.. ఏదో ఒక స్థాయిలో పార్టీపై ఏ వర్గంలో అసంతృప్తి ఉందో పసిగట్టి.. దానిని తగ్గించే ప్రయత్నాలు నిరంతరం జరుగుతుంటాయి. ఎక్కడైనా పార్టీ విఫలమైనా ఆరెస్సెస్ అయినా అందిపుచ్చుకుని మార్గనిర్దేశం చేస్తుంది. ఇప్పుడు కూడా యువత విషయంలో అసంతృప్తిని గ్రహించిన బీజేపీ.. అత్యున్నత స్థాయి నుంచి కింది వరకు జెన్‌జీకి చేరువయ్యే మార్గాలు వెతికే పనిలో పడింది. ఓం ప్రథమంగా ప్రధాని మోడీ ఎర్రకోటపై చేసిన ప్రసంగంలో.. యువ మంత్రం పఠించారు. జెన్‌జీని ఏ విధంగానూ నిరాశపరచబోమనే భరోసా ఇవ్వడంతో.. ఏకంగా కోటి మంది విద్యార్థులకు ఏఐలో శిక్షణ ఇస్తామని, అలాగే పోటీపరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ ఇస్తామని ప్రకటించారు. ఒక్క మోడీ ప్రసంగంతో బీజేపీ యువతను వదిలిపెట్టలేదు. దానికి కొనసాగింపుగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మరో అడుగు ముందుకేశారు. యువతను బ్యాంకింగ్ రంగానికి మరింత దగ్గర చేయడానికి అక్టోబర్ 2 నుండి ప్రభుత్వ రంగ బ్యాంకులతో కలిసి ప్రత్యేకంగా బ్యాంకింగ్ ఫర్ యూత్ అనే ప్రత్యేక క్యాంపెయిన్‌ను ప్రారంభించాలని పిలుపునిచ్చారు. 16 ఏళ్లు పైబడిన యువతకు చదువు, ఉద్యోగాలు, వ్యాపారాలు, పెట్టుబడుల కోసం సులభంగా లోన్లు అందేలా చేయడమే ఈ క్యాంపెయిన్ ముఖ్య ఉద్దేశ్యం. దీంతో పాటు కాలేజీలు, యూనివర్సిటీలు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లను నేరుగా సందర్శించి యువతకు ఆర్థిక అక్షరాస్యతను పెంచే ప్రయత్నం చేస్తారు. బ్యాంకు శాఖల్లో ప్రత్యేకంగా యువ కియోస్క్‌లు, యువ బ్యాంకింగ్ మిత్ర ఏర్పాటు చేసి సేవలు అందిస్తారు. ప్రభుత్వ రుణ పథకాలు, లోన్ ప్రాసెస్,మంచి క్రెడిట్ స్కోర్ ప్రాముఖ్యతను యువతకు వివరించడానికి కూడా చొరవ తీసుకుంటారు. తద్వారా దేశవ్యాప్తంగా ఉన్న యువతకు కేంద్రం సానుకూలంగా ఉందనే సంకేతాలు బలంగా అందుతాయనే ఉద్దేశం కనిపిస్తోంది. ఇక చివరిగా జెన్‌జీ ఉద్యమం విషయంలో కూడా డ్యామేజ్ కంట్రోల్‌కు కేంద్రం నడుం బిగించింది. యువత కోరినట్టుగానే గతంలోనే మంత్రితో రాజీనామా చేయించడం, పేపర్ లీక్‌కు వ్యతిరేకంగా కఠిన చట్టం తెచ్చిన కేంద్రం.. ఇప్పుడు ఉద్యమంలో పాల్గొన్న అసాంఘిక శక్తులు మినహా మిగతా విద్యార్థులపై ఎలాంటి కేసులూ ఉండబోవని సుప్రీంకోర్టులో స్పష్టం చేసింది. అటు బీహార్లో విద్యార్థి ఉద్యమంపై కఠినంగా చర్యలు తీసుకున్న భోజ్‌పూర్, సివాన్ జిల్లాల ఎస్పీలతో సహా మొత్తం 18 మంది ఐపీఎస్ అధికారులను ఆ రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. సివాన్‌లో విద్యార్థి నిరసనల సమయంలో ఏకే-47 తుపాకీ ప్రయోగం వివాదం రేపింది. సివాన్ ఎస్పీగా ఉన్న పురన్ కుమార్ ఝాను ఆ బాధ్యతల నుంచి తప్పించి పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. అంతేకాదు నల్సార్ వర్సిటీ విద్యార్థుల లేఖపై కఠిన చర్యకు సిద్ధమైన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను కూడా ముందే నియంత్రించింది. ఈ విషయంలో సీజేఐ కూడా నేరుగా జోక్యం చేసుకున్నారు. యువతతో పార్టీకి వచ్చిన గ్యాప్‌ను అడ్వాంటేజ్ తీసుకుని ప్రతిపక్షాలు జెన్‌జీని తప్పుదోవ పట్టిస్తున్నాయని బీజేపీ ఆరోపిస్తోంది. ఇప్పటికే ఆ పార్టీల ట్రాప్‌లో పడొద్దని యువతను ప్రధాని మోడీ హెచ్చరించారు. దీనికి తోడుగా పార్టీ తరపున వీలైనన్ని మార్గాల్లో యువతకు చేరువయ్యే కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని బీజేపీ ఫిక్సైంది. ఇప్పటికే ఆ దిశగా కార్యాచరణ మొదలుపెట్టిన కాషాయ పార్టీ.. భవిష్యత్తులోనూ సందర్భం కుదిరినప్పుడల్లా.. జెన్‌జీని అడ్రస్ చేయాలని భావిస్తోంది. భవిష్యత్తులో జరిగే కీలక ఎన్నికల్లో విజయానికి యువత ఓట్లు కీలకమని భావిస్తున్న బీజేపీ.. అందుకు తగ్గట్టుగా రాజకీయ వ్యూహాల్లో మార్పులు చేసుకుంటోంది. బీజేపీ రాజకీయ చరిత్ర చూసుకుంటే.. అవసరమైనప్పుడల్లా వ్యూహాల్లో మార్పులు చేసుకునే అలవాటు ఆ పార్టీకి మొదట్నుంచీ ఉంది. కీలక పరిణామాలు, ఎన్నికల ఫలితాలు, సమకాలీన రాజకీయ ఘటనల ఆధారంగా ఎప్పటికప్పుడు తనను తాను బీజేపీ కొత్తగా ఆవిష్కరించుకుంటూ వస్తోంది. ఇప్పుడు పుష్కర కాలంగా అధికారం చెలాయిస్తున్నా.. అవసరమైనప్పుడు మార్పులు చేసుకోవటానికి ఎప్పుడూ వెనుకాడలేదు. ఇటీవలి జంతర్ మంతర్ పరిణామాలతో పునరాలోచనలో పడ్డ బీజేపీ.. మరోసారి రీసెట్ బటన్ నొక్కింది. చిన్న అవకాశం వచ్చినా ప్రతిపక్షాలు పూర్తిగా ఉపయోగించుకుని.. ఏకంగా తమ అజెండా అమలు చేయకుండా.. ఏకంగా పార్లమెంట్‌నే స్తంభింపజేయటాన్ని బీజేపీ చాలా సీరియస్‌గా తీసుకుంటోంది. రాబోయే రోజుల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదంటే.. యువతలో అసంతృప్తిని వీలైనంత త్వరగా చల్లార్చటమే మార్గమని యోచిస్తోంది. అందుకే ప్రధానితో మొదలుపెట్టి.. పార్టీ కార్యకర్త వరకు అన్ని స్థాయిల్లో యువతను అడ్రస్ చేయాల్సిందేనని, అందుకోసం ప్రతి స్థాయిలో కార్యక్రమాలు రూపకల్పన చేయాలని ఫిక్సైంది. ప్రతి పార్టీకి కార్యవర్గం చాలా కీలకంగా పనిచేస్తుంది. సాధారణంగా కార్యవర్గం కూర్పులోనే.. ఆ పార్టీ ఉద్దేశాలేంటో ఓ క్లారిటీ వస్తుంది. ప్రత్యేక సందర్భాల్లో.. కీలక రాజకీయ పరిణామాల తరుణంలో చేసే కార్యవర్గ కూర్పు మరింత ప్రాధాన్యతను సంతరించుకుంటుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా యువత జాగృతమైన తరుణంలో.. బీజేపీ నూతన జాతీయ కార్యవర్గాన్ని ప్రకటించింది. అందులో ట్రెండ్‌కు తగ్గట్టుగా యువతకు పెద్దపీట వేసింది. కొత్త బృందంలో ఆరుగురు 40 ఏళ్లలోపువారు కాగా.. 15మంది 40-49ఏళ్ల వారున్నారు. మన దేశ రాజకీయాల్లో 50 ఏళ్ల లోపు నేతల్ని యువతగా పరిగణించే సంప్రదాయంగా ఉంది. అలా చూసినప్పుడు బీజేపీ కొత్త జాతీయ కార్యవర్గంలో యాభై ఏళ్ల లోపు వారు ఏకంగా 21 మందికి అవకాశం కల్పించడం ద్వారా.. యువతకు తమ పార్టీలో ప్రాధాన్యత విషయంలో సందేహాలు అక్కర్లేదని బీజేపీ స్పష్టం చేసింది. అదే సమయంలో పార్టీ సోషల్ మీడియా విభాగాన్ని కూడా బీజేపీ పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసింది. ఏకంగా గత పదకొండేళ్లుగా పార్టీ ఐటీ సెల్ చీఫ్‌గా కొనసాగుతున్న అమిత్ మాలవీయను.. తప్పించింది. ఆయన స్థానంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన దీపక్ మాస్కేను సోషల్ మీడియా కన్వీనర్‌గా నియమించింది. దీపక్ మాస్కేకు.. పార్టీ ఐటీ, సోషల్ మీడియా సెల్‌లో 15 సంవత్సరాలుగా పనిచేసిన అనుభవం ఉంది. బిహార్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమబెంగాల్ సహా పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో సోషల్ మీడియా ప్రచార బాధ్యతలను ఆయన నిర్వర్తించారు. ఇక పార్టీ సోషల్ మీడియా కో-కన్వీనర్లుగా.. ప్రీతి గాంధీ, శివానంద్ ద్వివేది, అలోక్‌భట్, అరుణ్‌యాదవ్ ఆయనకు సహకరించనున్నారు. దేశ రాజకీయాలపై జెన్ జీ ప్రభావం పెరుగుతున్న తరుణంలో.. పార్టీ సోషల్ మీడియా కార్యకలాపాలను మరింత బలోపేతం చేసేందుకే ఈ మార్పు జరిగినట్టు పార్టీవర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ సోషల్ మీడియాలో మిగతా పార్టీల కంటే యాక్టివ్‌గా ఉండే బీజేపీ.. ఇటీవలి ఘటనల తర్వాత ఫేస్ బుక్, వాట్సాప్‌తో పాటు ఇన్‌స్టాగ్రామ్ లాంటి కొత్త సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో కూడా యాక్టివ్ అయింది. ఇక ముందు కూడా సోషల్ మీడియా ద్వారా యువతకు పార్టీ రీచ్ అయ్యే విషయంలో ఎక్కడా గ్యాప్ రావద్దని సోషల్ మీడియా సెల్‌ను పటిష్ఠం చేసినట్టుగా కనిపిస్తోంది. ఆమాటకొస్తే.. అసలు సోషల్ మీడియా ద్వారా యువతకు నేరుగా రీచ్ అయ్యే పనిని ప్రధాని మోడీనే మొదలుపెట్టారు. విద్యార్థి ఉద్యమం సమయంలో మోడీ అర్ధరాత్రి ఇన్‌స్టా వీడియోలు పోస్ట్ చేసి.. జెన్‌జీ దృష్టిని ఆకర్షించారు. అంతేకాదు తన క్యాబినెట్ సహచరులు కూడా యువతతో టచ్‌లో ఉండాలని ఆదేశించారు. తద్వారా యువత ఆలోచనల్ని ఎప్పటికప్పుడు పసిగట్టడంతో పాటు.. ప్రభుత్వ పనితీరు గురించి జెన్‌జీ ఏమనుకుంటుందో తెలుసుకునే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. యువతలో అసంతృప్తి పెరగకముందే.. పసిగడితే.. దాన్ని సరైన రీతిలో అడ్రస్ చేసే వీలుంటుందని, అప్పుడు ప్రతిపక్షాలకు మొన్నటి ఘటనల మాదిరిగా అడ్వాంటేజ్ రాదనేది బీజేపీ వ్యూహంగా ఉంది. ఇప్పటికే జంతర్ మంతర్ పరిణామాలపై ఆత్మసమీక్ష చేసుకున్న బీజేపీ.. జరిగిన పొరపాట్లు, వాటికి కారణాలు.. పార్టీ పనితీరులో లోపాలు మొదలైన వాటి గురించి కూలంకషంగా అంతర్గత చర్చలు జరిపింది. ఆ చర్చల్లో వచ్చిన అభిప్రాయాల మేరకు కార్యాచరణకు రూపకల్పన చేసి.. దాన్ని వేగంగా అమలు చేసే దిశగా ముందడుగు వేస్తోంది.

# 90 లక్షల ఓటర్ల వివరాల్లో లోపాలా?

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కేవలం ఒక పౌరుడి హక్కు మాత్రమే కాదు.. ప్రభుత్వాలను ఎన్నుకునే అత్యంత శక్తివంతమైన సాధనం. అందుకే ఓటర్ల జాబితా ప్రతి ఎన్నికల ప్రక్రియకు పునాది. ఆ జాబితాలో ఒక్క తప్పు కూడా ఒక అర్హుడైన పౌరుడిని ఓటు హక్కుకు దూరం చేసే అవకాశం ఉంది. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణలో తాజాగా విడుదలైన ముసాయిదా ఓటర్ల జాబితాలో దాదాపు 90 లక్షల మంది వివరాల్లో లోపాలు ఉన్నాయని పౌర సంఘాలు పేర్కొనడం ఆందోళన కలిగించే అంశం. క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువును డిసెంబర్ 31 వరకు పొడిగించాలని పౌర సంఘాల నేతలు కోరడం వెనుక ఉన్న ఆందోళనను ఎన్నికల సంఘం సీరియస్‌గా పరిగణించాలి. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ వేగంగా పూర్తిచేయడం కంటే.. ఒక్క అర్హుడైన ఓటరు కూడా అన్యాయంగా జాబితా నుంచి తొలగిపోకుండా చూడటం మరింత ముఖ్యమైన బాధ్యత. ఓటర్ల జాబితా సవరణకు గడువు నిర్ణయించడం పరిపాలనా అవసరం కావచ్చు. కానీ ప్రజలకు సరైన సమాచారం అందకపోతే, అధికారుల నుంచి తగిన సహకారం లభించకపోతే ఆ గడువు ప్రజాస్వామ్య హక్కులకు అడ్డంకిగా మారకూడదు. ముఖ్యంగా వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు, దూర ప్రాంతాల్లో నివసించేవారు, విదేశాల్లో ఉన్న విద్యార్థులు, ఉద్యోగులు వంటి వారు నిర్ణీత సమయంలో వ్యక్తిగతంగా హాజరై పత్రాలు సమర్పించడం ఎల్లప్పుడూ సాధ్యం కాదు. అందుకే పౌర సంఘాలు సూచించినట్లుగా, నోటీసులు అందుకున్న ప్రతి వ్యక్తికి స్పందించేందుకు కనీసం మూడు నుంచి నాలుగు రోజుల సమయం ఇవ్వడం సముచితమైన చర్య. ఒక నోటీసు ఇచ్చి వెంటనే తుది నిర్ణయం తీసుకోవడం కంటే, పౌరుడి వివరణను వినడం ప్రజాస్వామ్య పరిపాలనలో ప్రాథమిక సూత్రం. ఓటర్ల జాబితాలో తప్పులు ఉన్నప్పుడు మొత్తం బాధ్యతను ప్రజలపైనే నెట్టడం సరికాదు. 2002 ఓటర్ల జాబితాతో తమ సంబంధాన్ని తెలియజేసే వివరాలను నమోదు చేయడంలో ప్రజలకు సరైన సమయం, అవగాహన కల్పించలేదన్న ఆరోపణలు వస్తున్నాయి. నిజంగా అలా జరిగి ఉంటే అది ఎన్నికల యంత్రాంగం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశం. బూత్ స్థాయి అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి. వారికి తగిన సిబ్బంది, సాంకేతిక సౌకర్యాలు, స్పష్టమైన మార్గదర్శకాలు, అవసరమైన సమయం కేటాయించాలి. ఒకవైపు భారీ స్థాయిలో సవరణ ప్రక్రియ నిర్వహిస్తూ మరోవైపు బీఎల్‌వోలకు తగిన వనరులు ఇవ్వకపోతే చివరికి ఇబ్బంది పడేది సాధారణ ఓటరే. ప్రతి ఓటరు కార్యాలయానికి వెళ్లి పత్రాలు సమర్పించగలడనే ఆలోచన వాస్తవానికి దూరంగా ఉంటుంది. వృద్ధులు, అనారోగ్యంతో బాధపడేవారు, విదేశాల్లో చదువుతున్న విద్యార్థులు, ప్రయాణాల్లో ఉన్నవారు వంటి వారికి ప్రత్యామ్నాయ విధానాలు అవసరం. వారి కుటుంబ సభ్యులు తగిన ఆధారాలతో వారి తరఫున హాజరై పత్రాలు సమర్పించే అవకాశం కల్పించడంపై ఎన్నికల సంఘం సానుకూలంగా పరిశీలించాలి. ఇలాంటి సౌకర్యాలు ఇతర రాష్ట్రాల్లో అమలులో ఉన్నాయనే విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ఎన్నికల ప్రక్రియలో సాంకేతికత పెరుగుతున్నప్పుడు.. పౌరులకు సౌలభ్యం కల్పించే విధానాలు కూడా పెరగాలి. పేరు, చిరునామా, ఇతర వ్యక్తిగత వివరాల్లో తప్పులు ఉంటే వాటిని సరిచేసుకునేందుకు ఫారం-8 వంటి మార్గాలను ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచాలి. ఫారం ఉందని చెప్పడం మాత్రమే కాకుండా.. దాన్ని ఎలా దాఖలు చేయాలి? ఏ పత్రాలు అవసరం? ఎక్కడ సమర్పించాలి? ఎంతకాలంలో పరిష్కరిస్తారు? అనే విషయాలపై స్పష్టమైన అవగాహన కల్పించాలి. అలాగే ఆధార్‌కు సంబంధించి ఉన్న విధానపరమైన సందిగ్ధతలను కూడా స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. ఓటరు అర్హత లేదా పౌరసత్వాన్ని నిర్ధారించేందుకు ఆధార్‌ను ప్రామాణికంగా పరిగణించవచ్చా, ఇతర ప్రక్రియల్లో దాని అవసరంపై ప్రజల్లో గందరగోళం తలెత్తకుండా స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలి. ఓటర్ల జాబితా ఒక సాధారణ పరిపాలనా పత్రం కాదు. అందులోని ప్రతి పేరు వెనుక ఒక పౌరుడి ఓటు హక్కు, ప్రజాస్వామ్య భాగస్వామ్యం ఉన్నాయి. అదే విధంగా తప్పుగా నమోదైన పేరు కూడా భవిష్యత్తులో సమస్యలకు దారితీయవచ్చు. అందువల్ల సవరణ ప్రక్రియలో వేగం కంటే ఖచ్చితత్వం, లక్ష్యాల కంటే పారదర్శకత, గడువుల కంటే ప్రజల హక్కులకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్నికల సంఘంపై ప్రజలకు ఉన్న నమ్మకం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకం. ఆ నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో ఉండేలా, ఏ అర్హుడైన ఓటరుకు తన హక్కును నిరూపించుకునే అవకాశం ఇవ్వాలి. అవసరమైతే గడువును పొడిగించాలి. ఓటర్ల జాబితా సవరణలో ఒక రోజు ఆలస్యం ప్రజాస్వామ్యానికి పెద్ద నష్టం కాదు.. కానీ ఒక అర్హుడైన పౌరుడి పేరు తొలగించబడటం మాత్రం అతని హక్కుకు తీరని నష్టం. కాబట్టి తొందరపాటు కాదు.. పారదర్శకత, సమగ్రత, ప్రజల హక్కుల పరిరక్షణే ఎన్నికల సంఘం ముందున్న అసలైన లక్ష్యం కావాలి.

# మంత్రి కొండా సురేఖకు దెబ్బమీద దెబ్బ..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మంత్రి కొండా సురేఖ చుట్టూ వివాదాలు చుట్టుముట్టాయి. తన కుమార్తె కొండా సుష్మిత చేసిన వ్యాఖ్యలతో ఇప్పటికే తీవ్ర ఇబ్బందుల్లో పడిన ఆమెకు రెండు భారీ ఎదురుదెబ్బలు తగిలాయి. ఒకవైపు ఆమె మాజీ ఓఎస్డీ సుమంత్‌పై హత్యాయత్నం కేసు నమోదు కాగా, మరోవైపు సొంత పార్టీకి చెందిన 20 నుంచి 30 మంది ఎమ్మెల్యేలు ఆమెకు వ్యతిరేకంగా సమావేశమై తిరుగుబాటు బావుటా ఎగరవేయడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది.

**మాజీ ఓఎస్డీ పై 'అటెంప్ట్ టు మర్డర్' కేసు..**

మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ తో పాటు మరో ఐదుగురిపై జూబ్లీహిల్స్ పోలీసులు 'అటెంప్ట్ టు మర్డర్' కేసు నమోదు చేశారు. మేడిపల్లికి చెందిన గొంగడి హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదైంది. తనపై సుమంత్ సహా ఆరుగురు వ్యక్తులు ఇనుప రాడ్లతో విచక్షణారహితంగా దాడి చేశారని హరికృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదుతో మేడిపల్లి పోలీసులు ముందుగా జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ తర్వాత తదుపరి విచారణ నిమిత్తం కేసును జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. సుమంత్‌పై బీఎన్ఎస్ యాక్ట్‌లోని సెక్షన్ 109 కింద కేసు నమోదు చేసినట్లు సమాచారం. అయితే, వారం రోజుల క్రితం ఈ దాడి జరిగినప్పటికీ, తాజాగా సీఎం రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలోనే ఈ కేసు నమోదు కావడం గమనార్హం.

**కొండా సురేఖకు వ్యతిరేకంగా ఎమ్మెల్యేల భేటీ..**

మరోవైపు కాంగ్రెస్ పార్టీ అంతర్గత రాజకీయాల్లో కొండా సురేఖకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. కాసేపట్లో సీఎల్పీ వేదికగా దాదాపు 20 నుంచి 30 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా సమావేశం కాబోతున్నట్లుగా తెలుస్తోంది. మంత్రి సురేఖ వైఖరిపై చర్చించేందుకు ఈ భేటీ ఏర్పాటు కావడం సంచలనంగా మారింది. ఇప్పటికే టీపీసీసీ , సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ అధిష్ఠానం అత్యంత తీవ్రంగా పరిగణించింది. ఇక కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని మంత్రి కొండా సురేఖ స్పష్టత ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే, 'సంబంధం లేనప్పుడు ఆ వ్యాఖ్యలను కనీసం ఎందుకు ఖండించలేదు?' అని తిరుగుబాటు ఎమ్మెల్యేలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. సురేఖ ఇచ్చిన వివరణ ఏమాత్రం ఆమోదయోగ్యంగా లేదని వారు తేల్చిచెప్పారు. ఒకవైపు ఎమ్మెల్యేలు ఆమెకు వ్యతిరేకంగా భేటీ అవుతుంటే, మరోవైపు కొందరు సీనియర్ మంత్రులు, ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులు కొండా సురేఖకు మద్దతుగా నిలుస్తున్నారు. ఈ మొత్తం పరిణామాలతో కాంగ్రెస్ పార్టీలో వర్గపోరు మరోసారి పీక్స్‌కు చేరింది.

# మేం కాంప్రమైజ్ అయ్యాం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రీసెంట్‌గా లేడీ ఫోక్ డ్యాన్సర్‌తో రెడ్ హ్యాండెడ్‌గా హోటల్ గదిలో దొరికిపోయిన ఈశ్వర్ సాయి భార్య శరణ్య ఓ ఇంటర్వ్యూలో షాకింగ్ కామెంట్లు చేసింది. తమది ఏడేళ్ల రిలేషన్‌షిప్ అని తన భర్తను వదులుకోనని చెప్పింది. భర్తతో విడిపోవాలని అనుకోవట్లేదని, తాము కాంప్రమైజ్ అయ్యామని తెలిపింది. తన భర్త గురించి, తన గురించి కొందరు కామన్ సెన్స్ లేకుండా మాట్లాడుతన్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. అమ్మాయి కూడా క్షమాపణలు చెప్పిందని తెలిపింది. ఇకపై ఆ వీడియోలను ఎవరూ షేర్ చేయవద్దని కోరింది. వీడియోలు షేర్ చేయడం వల్ల తమ కుటుంబం పరువు, ఆ అమ్మాయి పరువు కూడా పోయే ప్రమాదం ఉందని తెలిపింది. తప్పు చేసినప్పటికీ వాళ్లు క్షమాపణలు చెప్పారని ఇక ఆ టాపిక్ వదిలేయాలని రిక్వెస్ట్ చేసింది. అంతే కాకుండా తన భర్త కొద్దిరోజుల నుండి ఇంటికి రావడంలేదని, తన భర్త గురించి అడిగేందుకు ఆ అమ్మాయికి కూడా చాలా సార్లు కాల్ చేశానని చెప్పింది. ఓసారి అదే అమ్మాయి విషయంలో ఆత్మహత్య చేసుకోవాలని అనుకున్నట్టు తెలిపింది. తాను ఎంతో బాధపడుతున్నా.. తన భర్త ఆ అమ్మాయితోనే ఉన్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. మొదట వీడియో తీయాలని నిర్ణయించుకోలేదని, కానీ హోటల్ లో చెడుగా ఏదో జరుగుతుందనే తన సోదరి వీడియో తీసిందని స్పష్టం చేసింది. గదిలోకి వెళ్లిన తరవాతనే వీడియో తీశామని, తమ వద్ద ఎలాంటి ఆధారాలు లేవని, ఆధారాల కోసమే వీడియో తీశామని వెల్లడించింది.

# రాజస్థాన్‌లో షాకింగ్ ఘటన..

**రాజస్థాన్ :** దేశవ్యాప్తంగా ప్రతి గ్రామానికి తిరుగుతూ.. 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్న కాక్రోచ్ జనతా పార్టీ నేతలకు రాజస్థాన్‌లోని జైపూర్ జిల్లాలో చేదు అనుభవం ఎదురైంది. బగ్రూ నియోజకవర్గం పరిధిలోని రాంపూరా కన్వార్‌పురా గ్రామంలోని ఓ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించేందుకు వచ్చిన సీజేపీ బృందానికి గ్రామస్థుల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. తమ 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారంలో భాగంగా పాఠశాల తనిఖీకి వచ్చిన సీజేపీ కార్యకర్తలను స్థానికులు వెంటపడి పెరిగెత్తించారు.



**గ్రామం ముందు బారికేడ్లు.. నిరసన**

సీజేపీ టీమ్ రాక కంటే ముందే స్థానిక ప్రజలు గ్రామానికి వచ్చే ప్రధాన రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేసి, లోపలికి వచ్చే వాహనాలను తనిఖీ చేశారు. సీజేపీ నాయకులు రాగానే వారి మధ్య, గ్రామస్థుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం సీజేపీ కార్యకర్తలను గ్రామం నుంచి బయటకు పంపేసినట్లుగా తెలుస్తోంది. ఆ తర్వాత గ్రామస్థులు పాఠశాల బయట ధర్నా చేపట్టి సీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే, ఈ ఘటనపై బగ్రూ డీఎస్పీ ధర్మేంద్ర శర్మ స్పందిస్తూ.. తమకు ఆ ఘటనపై ఎలాంటి ముందస్తు సమాచారం లేదా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

**గేదెల కొట్టంలో పాఠశాల..**

సదరు ప్రభుత్వ పాఠశాల భవనం ప్రమాదకరంగా మారడంతో దానిని మూసివేశారని, ప్రస్తుతం తరగతులను పక్కనే ఉన్న ఒక గేదెల కొట్టంలో నిర్వహిస్తున్నారని సమాచారం. బీజేపీ కార్యకర్తలతో కలిసి నిరసన తెలిపిన గ్రామస్థులు మాట్లాడుతూ.. ఈ భవనాన్ని బాగుచేసే సామర్థ్యం స్థానికులకు ఉందని, ప్రభుత్వం కూడా ఇప్పటికే ఈ పనుల కోసం నిధులు మంజూరు చేసిందని పేర్కొన్నారు. ఇటీవల సీజేపీ బృందాలు ప్రభుత్వ పాఠశాలల్లో జరిపిన తనిఖీల నేపథ్యంలో, పాఠశాలల్లోకి బయటి వ్యక్తులు, మీడియా ప్రవేశించకుండా రాజస్థాన్ విద్యాశాఖ ఆంక్షలు విధించినట్లుగా తెలుస్తోంది. అయితే, ఆ ఆంక్షలపై సీజేపీ కో-కన్వీనర్ అశుతోష్ ర్యాంకా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల దుస్థితిని బయటపడకుండా దాచేందుకే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నియంతృత్వ వైఖరిని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. తాము ప్రభుత్వ ఆజ్ఞలకు భయపడేది లేదని.. రాజస్థాన్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులు మెరుగుపడే వరకు మా 'స్కూల్ ఠీక్ కరో' ప్రచారం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# అర్వింద్‌కు మైండ్ పనిచేయడం లేదు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లండన్ పర్యటనపై బీజేపీ నాయకులు, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అనవసర రచ్చ చేస్తూ దిగజారుడు రాజకీయం చేస్తున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీజేపీ నాయకులకు మెదడు పనిచేయడం లేదని, ముఖ్యమంత్రి పర్యటనను కూడా రాజకీయం చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. గాంధీ భవన్‌లో ఆది శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వ అధికారిక అనుమతులతోనే బ్రిటన్ పర్యటనకు వెళ్లారని స్పష్టం చేశారు. లండన్‌లోని ప్రముఖ విద్యా సంస్థలు, క్రీడా ప్రాంగణాలను సందర్శించి అక్కడి ప్రమాణాలను పరిశీలిస్తే బీజేపీ నాయకులకు ఎందుకు కడుపునొప్పి అని ప్రశ్నించారు. ఈ విషయాలన్నీ తెలిసి కూడా ఎంపీ ధర్మపురి అర్వింద్ అతితెలివి ప్రదర్శిస్తూ, "భారత వ్యతిరేక శక్తులను కలవడానికే సీఎం వెళ్లారు" అని పిచ్చి కూతలు కూస్తున్నారని నిప్పులు చెరిగారు. 2014లో బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ప్రధాని నరేంద్ర మోడీ 103 విదేశీ పర్యటనలు చేసి 82 దేశాలు తిరిగారని ఆది శ్రీనివాస్ గుర్తు చేశారు. "ప్రధాని ఎందుకోసం వెళ్లారు? ఆయన కూడా పనిలేక తిరుగుతున్నారా?" అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన మూడేళ్ల కాలంలో కేవలం రెండు సార్లు దావోస్‌కు, ఒకసారి అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలకు మాత్రమే వెళ్లారని, రాష్ట్ర అభివృద్ధి కోసం వెళ్తే బీజేపీ నాయకులు ఏడవడం వారి మానసిక వైకల్యానికి నిదర్శనమని విమర్శించారు.



**తెలంగాణలో మీ ఆటలు సాగవు..**

"ఏ విధంగానైనా ఈసారి తెలంగాణలో అధికారంలోకి వస్తాం" అని ధర్మపురి అర్వింద్ మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, అక్రమ మార్గాల్లో అధికారంలోకి రావడం తమకు అలవాటే అని అర్వింద్ నిర్లజ్జగా ఒప్పుకుంటున్నారని దుయ్యబట్టారు. "అర్వింద్ గుర్తు పెట్టుకో.. తెలంగాణలో మీ ఆటలు సాగవు. ఇక్కడుంది రేవంత్ రెడ్డి. మా ప్రభుత్వం జోలికి వస్తే తోకలు కత్తిరించి పంపిస్తాం.. తాట తీస్తాం" అని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీఆర్ఎస్, బీజేపీ కలసి కుట్రలు చేస్తున్నాయని, గతంలో ఇలాగే ప్రయత్నించి బీఆర్ఎస్ ఘోరంగా దెబ్బతిన్నదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరించాల్సిన ఎంపీలు బెదిరింపులకు దిగడం హేయమైన చర్య అని అన్నారు. "ఏ విధంగానైనా అధికారంలోకి వస్తాం" అన్న అర్వింద్ వ్యాఖ్యలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు వెంటనే జవాబు చెప్పాలని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు.




# ఇక నెలకు రూ.350లకే మంత్లీ టోల్ పాస్

**న్యూ ఢిల్లీ :** జాతీయ రహదారులపై తరచూ ప్రయాణించే స్థానిక వాహనదారులకు ఊరట కలిగిస్తూ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ) కీలక నిర్ణయం తీసుకుంది. కేవలం రూ.350లకే నెలవారీ టోల్ పాస్ పొందే వెసులుబాటును అందుబాటులోకి తీసుకొచ్చింది. టోల్ ప్లాజాల వద్ద క్యూ లైన్లలో నిలబడాల్సిన అవసరం లేకుండా, పూర్తి డిజిటల్ విధానంలో ఆన్‌లైన్ ద్వారానే ఈ-పాస్ పొందే సదుపాయాన్ని తీసుకురానుంది. అయితే, ఇంతకు ముందు టోల్ ప్లాజాల వద్దకు నేరుగా వెళ్తేనే లభించే నెలవారీ పాస్ సేవలను ఇప్పుడు పూర్తి డిజిటల్ రూపంలోకి మార్చారు. ఈ కొత్త ఆన్‌లైన్ పాస్ విధానాన్ని దేశవ్యాప్తంగా ఉన్న 121 టోల్ ప్లాజాలకు ఎన్‌హెచ్ఏఐ విస్తరించింది. దీంతో స్థానిక వాహనదారులు ఎలాంటి డాక్యుమెంట్లు సమర్పించకుండానే ఇంటి నుంచే పాస్ పొందే అవకాశం లభించింది.

**రూ.350 లోకల్ పాస్‌కు అర్హతలు ఇవే..**

నిర్దేశిత టోల్ ప్లాజా నుంచి 20 కి.మీ పరిధిలో నివసిస్తున్న స్థానిక నివాసితులు మాత్రమే ఈ పాస్‌కు అర్హులుగా ఎన్‌హెచ్ఏఐ గుర్తించనుంది. ఈ మంత్లీ పాస్ సదుపాయం కేవలం సొంత, ప్రైవేట్ వాహనాలకు మాత్రమే వర్తిస్తుంది. ఉద్యోగం, వ్యాపారం, ఇతర పనుల నిమిత్తం ప్రతిరోజూ ఒకే టోల్ ప్లాజా దాటే స్థానికులకు ఈ పాస్ ద్వారా భారీగా ఆర్థిక భారం తగ్గనుంది. ఈ ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ కోసం ఎన్‌హెచ్ఏఐ వ్యవస్థను ప్రభుత్వ డేటాబేస్‌లతో లింక్ చేశారు. దరఖాస్తుదారుడి ఇంటి చిరునామాను నిర్ధారించడానికి డిజిలాకర్ ను, వాహనం వివరాలను సరిచూసేందుకు 'వాహన్' పోర్టల్‌ను ఉపయోగించనున్నారు. అడ్రస్, వాహన వివరాలు సరిపోలిన వెంటనే, లోకల్ పాస్ ఆటోమేటిక్‌గా మీ వాహన ఫాస్టాగ్ కి లింక్ కానుంది.

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడం ఇలా..**

మంత్లీ లోకల్ పాస్ కోసం అర్హులైన స్థానిక వాహనదారులు ఎన్‌హెచ్ఏఐ కి చెందిన అధికారిక రాజ్‌మార్గ్ యాత్ర మొబైల్ యాప్ ద్వారా చాలా సులభంగా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకొని ఈ లోకల్ పాస్‌ను పొందవచ్చు. టోల్ గేట్ల వద్ద వాహనాలు ఆగకుండా నేరుగా ప్రయాణించే మల్టీ-లేన్ ఫ్రీ ఫ్లో , బారియర్-లెస్ టోలింగ్ విధానాన్ని ప్రవేశపెట్టేందుకు ఎన్‌హెచ్ఏఐ సన్నాహాలు చేస్తోంది. సాధారణంగా పరిచయాలతో టోల్ దాటే స్థానిక వాహనాలకు, ఆటోమేటిక్ కెమెరాల ద్వారా పెండింగ్ టోల్ ఈ-నోటీసులు జారీ అవుతున్నాయి. ఈ డిజిటల్ పాస్‌ను ఫాస్టాగ్‌కి లింక్ చేయడం వల్ల స్థానికులకు ఎలాంటి అదనపు ఛార్జీలు, నోటీసులు రాకుండా నిరోధించే అవకాశం ఉంది. అయితే, ఈ డిజిటల్ లోకల్ పాస్ విధానాన్ని మొదట న్యూఢిల్లీలోని ముండ్కా-బక్కర్‌వాలా టోల్ ప్లాజా వద్ద పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించారు. అక్కడ విజయవంతం కావడంతో దీనిని దేశవ్యాప్తంగా ఉన్న టోల్ ప్లాజాలకు వచ్చే నెల నుంచి అమలు చేయనున్నారు.

# సివిల్ చట్టాలపై అవగాహన కీలకం

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** న్యాయవాద వృత్తిలోకి అడుగుపెడుతున్న యువ న్యాయవాదులు ముందుగా సివిల్ చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని, నిబంధనలపై పట్టు సాధించినప్పుడే వృత్తిలో రాణించగలరని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుద్దాల చలపతిరావు పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం హైకోర్టు అసోసియేషన్ హాల్‌లో న్యాయవాదుల కోసం ప్రత్యేక న్యాయ అవగాహన సదస్సు ఘనంగా జరిగింది. సంఘం అధ్యక్షుడు ఎస్. సురేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జస్టిస్ సుద్దాల చలపతిరావు ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు.

**కొత్త న్యాయవాదుల కోణంలో చట్టాల విశ్లేషణ**

ప్రారంభ దశలో ఉన్న న్యాయవాదుల దృష్టికోణంలో.. సివిల్ ప్రొసీజర్ కోడ్, స్పెసిఫిక్ రిలీఫ్ యాక్ట్, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ యాక్ట్ ప్రాథమిక నిబంధనలు అనే ఆసక్తికరమైన అంశంపై జస్టిస్ సుద్దాల చలపతిరావు ప్రసంగించారు. న్యాయస్థానాల్లో సివిల్ కేసుల వాదనల సమయంలో ఈ చట్టాల వినియోగం ఎలా ఉంటుంది. ఎదురయ్యే సవాళ్లు ఏమిటి.. అనే విషయాలను ఆయన వివరించారు. ముఖ్యంగా సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని కీలక సెక్షన్లు, ఆస్తుల బదిలీకి సంబంధించిన చట్టపరమైన చిక్కులను న్యాయమూర్తి విశ్లేషించిన తీరు యువ న్యాయవాదులకే కాకుండా, సీనియర్లకు కూడా ఎంతో విజ్ఞానదాయకంగా నిలిచిందని న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి హైకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో సీనియర్ న్యాయవాదులు, సంఘం సభ్యులు, యువ అడ్వకేట్లు హాజరై న్యాయమూర్తి ప్రసంగాన్ని ఆసక్తిగా ఆలకించారు. వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు ఇలాంటి సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయని సభ్యులు పేర్కొన్నారు .అసోసియేషన్ కార్యదర్శి పి. శ్రావణ్ కుమార్ గౌడ్ స్వాగతోపన్యాసంతో ఈ సదస్సు ప్రారంభమైంది. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. సురేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు డి.ఎల్. పాండు, మరో కార్యదర్శి కె. నిరంజన్ రెడ్డి, కోశాధికారి బాలాజీ బాణోత్, క్రీడలు-సాంస్కృతిక కార్యదర్శి విష్ణువర్ధన్ జయసూర్య, సంయుక్త కార్యదర్శి కుమారి పి. కృష్ణ కీర్తన తదితరులు న్యాయమూర్తికి ఘనస్వాగతం పలికారు. కార్యనిర్వాహక వర్గ సీనియర్ సభ్యులు కొండా రెడ్డి జక్కా, రుక్మిణి పల్లెల, మహిళా సభ్యులు శిల్పా గెల్లి, భార్గవి కావలి, ఈసీ సభ్యులు అరవింద్ కుమార్ గాడి, పూల్ సింగ్ నాయక్ రామావత్, రవి పోనంపల్లి సంయుక్త కార్యదర్శి పి. కృష్ణ కీర్తన వందన తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో సవతుల పోరు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న పరిస్థితులపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీలో సవతుల పోరు నడుస్తోందని అన్నారు. కాంగ్రెస్ నేతల అంతర్గత కలహాల వల్ల రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ పుంజుకుంటోందని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి నిక్కచ్చిగా వ్యవహరిస్తూ, ఏ తప్పూ చేయకుండా ఉంటేనే మంత్రులు, కిందిస్థాయి అధికారుల్లో భయం ఉంటుందని చెప్పారు. 22ఏ భూముల నిబంధనను కొందరు దారుణంగా దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వంలో సీపీఐ భాగస్వామి కాదని, ఎన్నికలలో కేవలం సీట్ల సర్దుబాటు మాత్రమే చేసుకున్నామని చెప్పారు. అంతే కాకుండా తమ సూచనలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ లో పలువురు నేతల మధ్య విభేదాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఇటీవల పరకాల ఎమ్మెల్యే టికెట్ తనదే అంటూ కొండా సుస్మిత చేసిన వ్యాఖ్యలతో పార్టీలో కుదుపులు మొదలయ్యాయి. అంతేకాకుండా ఆమె సీఎం రేవంత్ పైనే నేరుగా అవినీతి ఆరోపణలు, విమర్శలు చేశారు. మరోవైపు తుంగతుర్తిలో రాజగోపాల్ రెడ్డి, మందుల సామేలు మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. వీటితో పాటు వనపర్తి కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే మేఘారెడ్డి వర్సెస్ కాంగ్రెస్ సీనియర్ నేత చిన్నారెడ్డి మధ్య వార్ నడుస్తోంది.



# సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ మహానగర పరిధిలోని రాయదుర్గం పాన్‌మక్తా వద్ద గల ప్రభుత్వ భూముల వేలం ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు నిరాకరించింది. ఈ వివాదానికి సంబంధించిన ఏ అంశమైనా సరే ముందుగా హైకోర్టులోనే తేల్చుకోవాలని భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. అయితే, రాయదుర్గం పాన్‌మక్తా పరిధిలోని సుమారు 11 ఎకరాల అత్యంత విలువైన భూములను విక్రయించేందుకు తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) వేలం నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా ఒక్కో ఎకరాకు కనీస ధరగా రూ.175 కోట్లను నిర్ణయించింది. ఈ క్రమంలో టీజీఐఐసీ జారీ చేసిన ఈ వేలం నోటిఫికేషన్‌ను సవాలు చేస్తూ జువ్వాడి ప్రణయ్ సింహారావు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం, నోటిఫికేషన్ ప్రక్రియలో తాము ఎలాంటి జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. ఈ వ్యవహారంపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలంగాణ హైకోర్టుకు వెళ్లాలని సూచిస్తూ పిటిషన్‌ను తోసిపుచ్చింది.



## కోడేరు కస్తూర్బ గాంధీ పాఠశాల లో అడ్మిషన్ ల కొరకు దరఖాస్తులకు ఆహ్వానం

**కోడేరు/నాగర్ కర్నూల్,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** కోడేరు మండల కేంద్రం లోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయము కోడేరు మండల కేంద్రంలోని కేజీబీవీ కళాశాలలో 202627 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఏఐ,డఎంఎల్ (ఇంగ్లీష్ /మీడియం ) కోర్సుకి 12 సీట్లు వేకెన్సీ ఉన్నాయి మరియు ఆరవ తరగతిలో కేవలం నాలుగు సీట్లు మా-త్రమే ఉన్నవి అర్హులైన విద్యార్థులు కస్తూరిబా పాఠశాల కోడేరు నందు సంప్రదించవలసినదిగా పాఠశాల ప్రిన్సిపల్ కే. సుజాత తెలిపారు,

## ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా స్వయంగా పరిశీలించిన మంత్రి



**కోడేరు/పెంట్లవెల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** పెంట్లవెల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా గౌరవ మంత్రివర్యులు శ్రీ జూపల్లి కృష్ణారావు గారు లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న ఇళ్ల స్థితిగతులను స్వయంగా పరిశీలించి, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గౌరవ మంత్రివ-ర్యులు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా, ఇప్పటికే గోడలు నిర్మించుకుని స్లాబ్ వేసుకునే స్థితిలో ఉన్న అర్హులైన లబ్ధిదారులకు రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. అలాగే, ఇల్లు నిర్మాణంలో బేస్ లెవెల్ వరకు పూర్తి చేసుకుని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మిగతా నిర్మాణాన్ని కొనసాగించలేకపోతున్న అర్హులైన లబ్ధిదారులకు రూ. 4 లక్షల ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా లబ్ధి చేకూర్చుతున్నామని వెల్లడించారు. అర్హత, ఇంటి ప్రస్తుత స్థితిగతులు మరియు లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపడుతున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామన్ గౌడ్, హౌసింగ్ డీఈ రాజవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శెట్టిపాలెం గ్రామంలో అభివృద్ధి పనులకు శ్రీకారం







**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ నియోజకవర్గం లోని వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన పల్లె దావాఖాన,మహిళా సంఘం భవనం, అంగన్వాడీ కేంద్రాలను మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి మరియు ఆర్డీవో రమణా రెడ్డి లు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎల్ఆర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం,మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడం, చిన్నారులకు మెరుగైన పోషకాహారం మరియు విద్యా వాతావరణం కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. పల్లె దావాఖాన ద్వారా గ్రామ ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు స్థానికంగానే అందుబాటులోకి వస్తాయని, మహిళా సంఘం భవనం ద్వారా మహిళా సంఘాల కార్యకలాపాలకు, స్వయం ఉపాధి మరియు ఆర్థిక సాధికారత కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు. అలాగే అంగన్వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య మరియు ఆరోగ్య పరిరక్షణ సేవలు మరింత మెరుగ్గా అందుతాయని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను దశలవారీగా అభివృద్ధి చేస్తూ ప్రజా సంక్షేమం,గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. శెట్టిపాలెం గ్రామ అభివృద్ధికి అవసరమైన మరిన్ని సమస్యలను గుర్తించి,వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,అధికారులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,మహిళా సంఘాల ప్రతినిధులు,అంగన్వాడీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## కొల్లాపూర్ రెవెన్యూ కార్యాలయంలో మంత్రి జూపల్లి ఆకస్మిక తనిఖీ



**కొల్లాపూర్,ఫ్లాష్ ఇండియా ప్రతి నిధి :** నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ రెవిన్యూ కార్యాలయాన్ని మంత్రి జూపల్లి కృష్ణా రావు ఆకస్మిక సందర్శించారు, ఈ సందర్భంగా పెంట్లవెల్లి మండలం లోని రెవిన్యూ వినతులపై మంత్రి జూపల్లి కృష్ణా రావు సమీక్షా నిర్వహించారు, కొల్లాపూర్ ఆర్డీవో కార్యాలయంలో చెత్త గా పడిఉన్న ఫైళ్ల ను అధికారులను ప్రశ్నించారు, అనంతరం కార్యాలయంలో కలియతిరిగిన మంత్రి జూపల్లి కృష్ణరావు, టాయిలెట్లు అపరిశుభ్రంగా ఉండడంతో గమనించి ఆర్డీఓ పై ఆగ్రహం వ్యక్తము చేశారు, తానే స్వయంగా నీళ్లు పోసి శుభ్రం చేశారు, మంత్రి జూపల్లి కృష్ణ రావు వెంట పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 24న చెన్నకేశవస్వామి కళ్యాణం



**అడవిదేవులపల్లి,ఫ్లాష్ ఇండియా :** అడవిదేవులపల్లి మండల శివారులోని బౌద్ధమగుళ్ళ దేవాలయ సముదాయంలో ఈ నెల 24న శ్రీదేవి,భూదేవి సమేత చెన్నకేశవస్వామి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకులు రమణమూర్తిశర్మ, స్వామివారి సేవకుడు పసుపులేటి అంజయ్య తెలిపారు. శ్రావణ శుద్ధ ద్వాదశి సందర్భంగా జరిగే వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. తీర్థప్రసాదాలు స్వీకరించాలని సూచించారు.

## అథ్లెటిక్ పోటీల్లో సత్తా చాటిన గాంధారి ఈఎంఆర్ఎస్ విద్యార్థులు

**గాంధారి,ఫ్లాష్ ఇండియా :** గాంధారి మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో అద్భుతమైన ప్రతిభను కనబరిచి పథకాలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్ తెలిపారు. జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పథకాలను సాధించిన క్రీడాకారులను, శుక్రవారం పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా పా-ఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో, అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన 12వ జిల్లా స్థాయి జూనియర్ అథ్లెటిక్ పోటీల్లో, పాల్గొన్న గాంధారి ఈఎంఆర్ఎస్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి 10 స్వర్ణ పతకాలు, 03 రజత పతకాలు, 03 కాంస్య పతకాలు, మొత్తం 16 పథకాలను సాధించినట్లు తెలిపారు. జిల్లాస్థాయి అథ్లెటిక్ పోటీల్లో అద్భుతంగా రాణించిన గాంధారి ఈఎంఆర్ఎస్ పా-ఠశాల విద్యార్థులు 10 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు, ఈనెల ఈ 26, 27 తేదీల్లో హన్మకొండ, వరంగల్ లో నిర్వహించే పోటీల్లో జిల్లా జట్టు తరఫున పాల్గొంటారని ఆయన తెలిపారు. వైస్-ప్రిన్సిపాల్ సవితా జైన్, గోపాల్ మండల్ ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులు ఉన్నారు.

## మిర్యాలగూడలో ట్రస్మా ఆధ్వర్యంలో కల్లు రూపా రెడ్డి సంతాప ర్యాలీ..







**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** నల్లగొండ జిల్లా,కొండ మల్లేపల్లి లో ఇటీవల దారుణ హత్యకు గురైన నాగార్జున కాన్సెప్ట్ స్కూల్ ప్రిన్సిపల్ స్వర్గీయ కల్లు రూపా రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ట్రస్మా (తెలంగాణ రికగ్నైజింగ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్) మిర్యాలగూడ పట్టణ శాఖ ఆధ్వర్యంలో సంతాప ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మరియు ఆర్డీవో ఎస్ రామారావు రెడ్డికి ఉపాధ్యాయులకు రక్షణ కల్పించాలని వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని ట్రస్మా పరిధిలోని ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ,కాంగ్రెస్ పార్టీ నాయకులు గుడిపాటి నవీన్ కుమార్,కాంగ్రెస్ పార్టీ 1టౌన్ ప్రెసిడెంట్ కోడిరెక్క ఇంద్ర కుమార్,20వ వార్డ్ కౌన్సిలర్ దేశిడి శ్రీలేఖ - శేఖర్ రెడ్డి,ట్రస్మా ప్రతినిధులు, వివిధ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు మరియు ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారంతా నిందితులను కఠినంగా రూపా రెడ్డిని హత్య చేసిన నిందితులను శిక్షించాలని మరియు బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ర్యాలీ అనంతరం రూపా రెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా మిర్యాలగూడ పట్టణ బాధ్యులు,పలు పాఠశాలల కరస్పాండెంట్లు,ప్రిన్సిపాళ్లు మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,మరియు ఆర్డిఓ రమణా రెడ్డి,తహసిల్దార్ ప్రజా ప్రతినిధులు,సంబంధిత అధికారులు పాల్గొని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు సమర్థవంతంగా అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా, సులభతరంగా సేవలు అందించే అవకాశం ఉంటుందని తెలిపారు. పేద,మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,సంబంధిత శాఖల అధికారులు,సిబ్బంది, లబ్ధిదారులు మరియు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## నాటిన ఈత మొక్కలను సంరక్షించాలి



**లింగంపేట,ఫ్లాష్ ఇండియా :** వనమహోత్సవంలో భాగంగా నాటిన ఈత మొక్కలను గౌడ కులస్తులు సంరక్షించాలని ఎల్లారెడ్డి ఎక్సైజ్ శాఖ సీఐ షాకీర్ అమ్మద్ అన్నారు. శుక్రవారం ఆయన లింగంపేట మండలం పర్మల్ల గ్రామ ఊర చెరువు కట్టపై 1000 ఈత మొక్కలను తన సిబ్బందితో కలిసి నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు స్వచ్ఛమైన ఈతకల్లు అందించాలనే లక్ష్యంతో ఎల్లారెడ్డి సర్కిల్ పరిధిలో ఊరూరా ఈత మొక్కలు నాటుతున్నట్లు ఆయన చెప్పారు. ఆయా గ్రామాల్లోని గౌడ కులస్తులు తమ వంతు బాధ్యతగా నాటిన మొక్కలను సంరక్షించాలని ఆయన సూచించారు. వన మహోత్సవంలో భాగంగా నాటిన ఈత మొక్కలు నాలుగేళ్ల వ్యవధిలో ఏపుగా పెరిగి స్వచ్ఛమైన కళ్ళు అందిస్తాయని ఆయన వివరించారు. కల్తీ కల్లును నివారించడం కోసమే ఏటా ఈతమొక్కలను నాటుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గడ్డం బాబాయి నరేష్, పంచాయతీ కార్యదర్శి నరేష్, రాజా గౌడ్, సమాచార హక్కు చట్టం రాష్ట్ర కార్యదర్శి లెగ్గేలరాజు, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్, బద్ద. చందు, బద్ద. ప్రభు రాజు, బాలకిషన్, సాయిలు, సాయిబాబు, ఉపాధి కూలీలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపల్లిలో ఆటో డ్రైవర్ల భారీ ర్యాలీ!



**పెద్దపల్లి,ఫ్లాష్ ఇండియా :** ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, లేని పక్షంలో ఈ నెల 24వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని తెలంగాణ ఆటో డ్రైవర్లు, ఓనర్ల జేఏసీ హెచ్చరించింది. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో తెలంగాణ ఆటో డ్రైవర్లు, ఓనర్ల జేఏసీ ఆధ్వర్యంలో సుమారు 300 ఆటోలతో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకు సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆటో డ్రైవర్లు, ఓనర్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవి కుమార్ యాదవ్, పెద్దపల్లి జిల్లా ఆటో జేఏసీ అధ్యక్షుడు వ్యాళ్ళ హరీష్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథాలతో పోల్చి చెప్పి, అధికారంలోకి వచ్చాక ఆటో కార్మికులను పూర్తిగా విస్మరించిందని ఆరోపించారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయి కుటుంబాలు గడవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం.. ప్రతి ఆటో డ్రైవర్‌కు ఏటా రూ. 12 వేల ఆర్థిక సాయాన్ని వెంటనే విడుదల చేయాలి అన్నారు. ఉపాధి కోల్పోయిన ఆటో కుటుంబాలను ఆదుకునేందుకు సమగ్ర సంక్షేమ పథకాలు అమలు చేయాలని తెలిపారు. ఆటో డ్రైవర్ల పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే, ఈ నెల 24 నుంచి నిరవధిక సమ్మె చేపట్టడంతో పాటు జాతీయ రహదారులను దిగ్బంధిస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు, వాహన యజమానులు పాల్గొన్నారు.

## మూడు గంటల్లో చోరీ కేసు ఛేదించిన రాయదుర్గం పోలీసులు



**శేరిలింగంపల్లి,ఫ్లాష్ ఇండియా :** దొంగతనం జరిగిన మూడు గంటల్లోనే సీసీటీవీ, సాంకేతిక ఆధారాలతో ఇద్దరు నిందితులను రాయదుర్గం పోలీసులు అరెస్ట్ చేశారు. డయల్-100కు పెట్రోల్ మొబైల్ సిబ్బంది వెంటనే స్పందించడంతో దొంగలను పట్టుకునేందుకు వీలు కలిగింది. ఇన్స్పెక్టర్ భూపతి కథనం ప్రకారం.. సమాచారం అందిన వెంటనే క్రైమ్ సిబ్బంది పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా, ఓ మహిళ, ఓ పురుషుడు చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. సీసీటీవీ ఆధారంగా కమేటి లక్ష్మి (37) ని అదుపులోకి తీసుకుని విచారించగా, తన దూరపు బంధువు వకలపురి శివ రాఘవేంద్ర (29)తో కలిసి చోరీ చేసినట్లు వెల్లడించింది. ఆమె సమాచారంతో సాంకేతిక ఆధారాల ద్వారా శివ రాఘవేంద్రను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రెండు బంగారు బ్రేస్‌లెట్లు, రెండు బంగారు గొలుసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. సీసీటీవీ, సాంకేతిక ఆధారాలను సమ-ర్థవంతంగా వినియోగించి కేసును వేగంగా ఛేదించిన రాయదుర్గం ఇన్‌స్పెక్టర్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, క్రైమ్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు. ఇళ్లను ఖాళీ చేసి వెళ్లే సమయంలో ప్రజలు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని రాయదుర్గం ఇన్స్పెక్టర్ భూపతి సూచించారు.

# ఊహించని ధరకు అమ్ముడైన దిగ్గజాల జెర్సీలు..




మాంచెస్టర్ యునైటెడ్ మాజీ మసాజర్ రోడ్ థోర్న్లీ సేకరించిన ప్రముఖ ఫుట్‌బాల్ ఆటగాళ్ల జెర్సీలకు సంబంధించిన వేలం పాటలో లియోనెల్ మెస్సీ జెర్సీ సరికొత్త రికార్డు సృష్టించింది. ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో జరిగిన ఈ వేలంలో క్రిస్టియానో రొనాల్డో జెర్సీ కంటే మెస్సీ జెర్సీ ఆరు రెట్లు ఎక్కువ ధరకు అమ్ముడై అందరినీ ఆశ్చర్యపరిచింది. బార్సిలోనా జట్టులో ఉన్నప్పుడు మెస్సీ ధరించిన ఈ ప్రత్యేకమైన జెర్సీ రూ. 56.4 లక్షలు (66,107 అమెరికన్ డాలర్లు) పలకగా, రొనాల్డోకు చెందిన రియల్ మాడ్రిడ్ జెర్సీ రూ. 9.05 లక్షలకు (10,601 డాలర్లు) మాత్రమే అమ్ముడయ్యాయి.మెస్సీ జెర్సీకి ఇంత భారీ ధర రావడానికి దాని వెనుక ఉన్న ఒక ఆసక్తికరమైన కథే ప్రధాన కారణం. 2012లో బార్సిలోనా జట్టు ఓల్డ్ ట్రాఫోర్డ్ పర్యటనకు రాకముందే, థోర్న్లీ తన స్నేహితుడైన బార్సిలోనా డిఫెండర్ గెరార్డ్ పికెకు సందేశం పంపి మెస్సీ జెర్సీ కావాలని కోరారు. మ్యాచ్ ముగిసిన వెంటనే పికె స్వయంగా థోర్న్లీని బార్సిలోనా డ్రెస్సింగ్ రూమ్‌కు తీసుకెళ్లారు. ఆ సమయంలో మెస్సీ తాను తొడుక్కున్న జెర్సీని తీసి, దానిపై స్వయంగా సంతకం చేసి థోర్న్లీకి అందించారు. మెస్సీ ప్రత్యక్షంగా ధరించిన జెర్సీ కావడంతో పాటు ఆయన సంతకం కూడా ఉండటంతో దీనికి భారీ వేలం ధర లభించింది.మరోవైపు రొనాల్డో జెర్సీ 2014-15 సీజన్‌కు చెందిన రియల్ మాడ్రిడ్ మ్యాచ్ కోసం సిద్ధం చేసినది అయినప్పటికీ, దానిని ఆయన మ్యాచ్‌లో ధరించలేదు. కేవలం థోర్న్లీ కోసం ఒక సందేశంతో సంతకం చేసి ఇవ్వడం వల్ల దీనికి తక్కువ ధర లభించింది. ఈ వేలంలో మాంచెస్టర్ యునైటెడ్ దిగ్గజాల జెర్సీలు కూడా బాగానే ధర పలికాయి. 2002 ఛాంపియన్స్ లీగ్ మ్యాచ్‌కు చెందిన ర్యాన్ గిగ్స్ జెర్సీ రూ. 8.62 లక్షలకు, పాల్ స్కోల్స్ జెర్సీ రూ. 3.91 లక్షలకు, డేవిడ్ బెక్‌హామ్ జెర్సీ రూ. 3.32 లక్షలకు అమ్ముడయ్యాయి. అలాగే నిక్కీ బట్ జెర్సీ రూ. 2.32 లక్షలు, గ్యారీ నెవిల్లే జెర్సీ రూ. 1.50 లక్షల చొప్పున ధర పలికాయి. ఏది ఏమైనా మెస్సీ క్రేజ్ ముందు మిగిలిన దిగ్గజాల జెర్సీల ధరలు వెలవెలబోయాయి.

# 33 ఏళ్ల దేశవాళీ కింగ్‌కు ఛాన్స్?




గాలె మైదానంలో శ్రీలంకతో జరిగిన తొలి టెస్టులో భారత్ 165 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. రెండో టెస్ట్ మ్యాచ్ ఆగస్ట్ 23 నుంచి కొలంబోలో ఆరంభం కానుంది. రెండో టెస్టులోనూ గెలిచి సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలని గిల్ సేన భావిస్తోంది. తొలి టెస్టులో యువ స్పిన్నర్ మానవ్ సుతార్ అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి 10 వికెట్లు తీసి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. దీంతో రెండో టెస్టు తుది జట్టులో అతడు కొనసాగనున్నాడు. అయితే భారత్ తుది జట్టులో ఓ కీలక మార్పు జరగనున్నట్లు తెలుస్తోంది.తొలి టెస్టులో భారత్‌కు బ్యాటింగ్, బౌలింగ్‌లో పెద్దగా ఇబ్బందులు ఎదురుకాలేదు. అయినప్పటికీ కెప్టెన్ శుభ్‌మన్ గిల్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఒక మార్పు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. సీనియర్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ స్థానంలో 33 ఏళ్ల దేశవాళీ కింగ్ సారంశ్ జైన్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన సారంశ్.. దేశవాళీ క్రికెట్‌లో మంచి ప్రదర్శనతో గుర్తింపు తెచ్చుకున్నాడు. రైట్ ఆర్మ్ బ్యాటింగ్‌తో పాటు ఆఫ్ స్పిన్ బౌలింగ్ చేయగల సారంశ్.. జట్టుకు అదనపు బ్యాటింగ్ బలం కూడా కానున్నాడు. తొలి టెస్టులో కుల్దీప్ 25 ఓవర్లు బౌలింగ్ చేసి 103 పరుగులు ఇచ్చాడు. మరోవైపు రవీంద్ర జడేజా, మానవ్ సుతార్ అద్భుతంగా బౌలింగ్ చేసి వికెట్స్ పడగొట్టారు.కుల్దీప్ యాదవ్ స్థానంలో సారంశ్ జైన్‌ను తీసుకుంటే.. శ్రీలంక బ్యాటర్లపై స్పిన్‌తో ఒత్తిడి పెంచడంతో పాటు బ్యాటింగ్ విభాగంలోనూ భారత్‌కు అదనపు బలం దక్కనుంది. సారంశ్ అరంగేట్రం చేస్తే.. ఓ రికార్డు నెలకొల్పనున్నాడు. లేటు వయసులో టీమిండియాకు అరంగేట్రం చేసిన భారత ఆటగాళ్ల జాబితాలో నిలుస్తాడు. దేశవాళీ ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో సారంశ్ 181 వికెట్లు, 2223 పరుగులు చేశాడు. మధ్యప్రదేశ్, సెంట్రల్ జోన్, రెస్ట్ ఆఫ్ ఇండియా జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. 2014లో మధ్యప్రదేశ్ తరఫున ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన సారంశ్.. 12 ఏళ్ల పాటు దేశవాళీ క్రికెట్‌లో రాణించాడు. ఎట్టకేలకు ఇప్పుడు భారత జట్టుకు ఎంపికయ్యాడు. ఇక తుది జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్నాడు.వికెట్ కీపర్-బ్యాటర్ ధ్రువ్ జురెల్ తన స్థానాన్ని నిలబెట్టుకునే అవకాశాలు ఉన్నాయి. తొలి ఇన్నింగ్స్‌లో అర్ధ సెంచరీతో రాణించిన జురెల్‌కు మరో అవకాశం ఇవ్వాలని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో సర్ఫరాజ్ ఖాన్‌కు తుది జట్టులో చోటు దక్కడం కష్టంగానే కనిపిస్తోంది. పేస్ విభాగంలోనూ పెద్దగా మార్పులు చేసే అవకాశం లేదు. ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్ తొలి టెస్టులో మంచి ప్రదర్శన చేయడంతో వారిని కొనసాగించే అవకాశాలే ఉన్నాయి. గుర్నూర్ బ్రార్‌కు అవకాశం ఇవ్వాలనే చర్చ ఉన్నప్పటికీ.. కీలకమైన రెండో టెస్టులో పేస్ బౌలింగ్ కాంబినేషన్‌ను మార్చడం అనవసరమైన రిస్క్‌గా టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోందట.

**టీమిండియా ప్రాబబుల్ ప్లేయింగ్ ఎలెవన్:**
యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్ (వికెట్ కీపర్), ధ్రువ్ జురెల్, రవీంద్ర జడేజా, సారంశ్ జైన్/కుల్దీప్ యాదవ్, మానవ్ సుతార్, ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్.

# ఒక్క పరుగుతో చేజారిన హిస్టరీ..



లీడ్స్‌లో ఇంగ్లాండ్, పాకిస్తాన్ జట్ల మధ్య జరుగుతున్న తొలి టెస్ట్ మ్యాచ్‌లో రెండు రోజుల ఆట ముగిసేసరికి ఇంగ్లాండ్ జట్టు పూర్తి ఆధిక్యంలో నిలిచింది. పాకిస్తాన్‌ను తొలి ఇన్నింగ్స్‌లో కేవలం 171 పరుగులకే ఆలౌట్ చేసిన ఇంగ్లాండ్, రెండో రోజు ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 366 పరుగులు చేసింది. ప్రస్తుతం ఇంగ్లాండ్ జట్టు 195 పరుగుల భారీ ఆధిక్యంలో ఉండగా, వారి చేతిలో ఇంకా రెండు వికెట్లు మిగిలి ఉన్నాయి. ఇంగ్లాండ్ కెప్టెన్ జో రూట్ 66 పరుగుల బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో తన టెస్ట్ కెరీర్‌లో 68వ అర్ధశతకాన్ని నమోదు చేసి జట్టుకు బలమైన పునాది వేశారు.అయితే ఈ ఇన్నింగ్స్‌లో జో రూట్ ఒక అరుదైన రికార్డుకు కేవలం ఒక్క పరుగు దూరంలో నిలిచిపోయారు. అంతర్జాతీయ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లలో (టెస్ట్, వన్డే, టి20) కలిపి కనీసం 10 వేల పరుగులు చేసిన బ్యాటర్లలో 50కి పైగా సగటు ఉన్న ఏకైక ఆటగాడిగా విరాట్ కోహ్లీ (52.71 సగటు) అగ్రస్థానంలో ఉన్నారు. రూట్ ఈ దిగ్గజ క్లబ్‌లో చేరడానికి 67 పరుగులు చేయాల్సి ఉండగా, 66 పరుగుల వద్దే అవుట్ అయ్యారు. దీంతో ఆయన బ్యాటింగ్ సగటు 49.99 వద్ద నిలిచిపోయి, స్వల్ప తేడాతో ఆ ఘనతను చేజార్చుకున్నారు. అయినప్పటికీ ఆయన జాక్స్ కల్లిస్, సచిన్ టెండూల్కర్, మైఖేల్ హస్సీ వంటి దిగ్గజాల కంటే మెరుగైన సగటుతో రెండో స్థానంలో కొనసాగుతున్నారు.రెండో రోజు ఆట ప్రారంభంలో వర్షం, మబ్బులతో కూడిన వాతావరణం పాకిస్తాన్ బౌలర్లకు అనుకూలించినప్పటికీ, వారు క్రమశిక్షణతో బౌలింగ్ చేయడంలో విఫలమయ్యారు. దీనిని అనుకూలంగా మలుచుకున్న జో రూట్, జోర్డాన్ కాక్స్ కలిసి 150 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన హ్యారీ బ్రూక్ 91 పరుగులతో విరుచుకుపడి పాకిస్తాన్ బౌలర్లపై తీవ్ర ఒత్తిడి పెంచారు. బ్రూక్ సెంచరీ చేజార్చుకున్నప్పటికీ, ఇంగ్లాండ్‌ను పటిష్టమైన స్థితిలో నిలిపారు. పాకిస్తాన్ స్పిన్నర్ అలీ ఉస్మాన్ 5 వికెట్లు తీసి రాణించినా, ఇంగ్లాండ్ భారీ ఆధిక్యాన్ని అడ్డుకోలేకపోయారు.

# టెస్టుల్లో సచిన్ రికార్డును సమం చేసిన రూట్



పాకిస్తాన్, ఇంగ్లాండ్ మధ్య టెస్ట్ మ్యాచ్ జరుగుతున్న నేపథ్యంలో జో రూట్ అరుదైన ఘనత సాధించాడు. పాక్ తో జరుగుతున్న తొలి టెస్ట్ సందర్భంగా 68వ అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న ఇంగ్లాండు టెస్ట్ కెప్టెన్ రూట్... సచిన్ టెండూల్కర్ రికార్డ్ ను సమం చేశాడు. సచిన్ టెండూల్కర్ ఇప్పటి వరకు 68 అర్ధ సెంచరీలు టెస్టులలో సాధించారు.ఆ తర్వాత రూట్ 68, చందర్ పాల్ 66, బోర్డర్ 63, రాహుల్ ద్రావిడ్ 63 అర్ధ సెంచరీలు నమోదు చేశారు. అదే సమయంలో కెప్టెన్ గా అత్యధిక అర్ధ సెంచరీలు చేసిన లిస్టులో రూట్ 5వ స్థానానికి చేరారు. ఈ లిస్టులో గ్రేమ్స్ స్మిత్ 61 అర్ధ సెంచరీలు చేసి మొదటి స్థానంలో నిలిచారు. ఆ తర్వాత రికీ పాంటింగ్ 54, బోర్డర్ 51 మిస్బా 43వ అర్ధ సెంచరీలు చేయగా తాజాగా రూట్ 42 ఫినిష్ చేసుకున్నాడు.







# స్మార్ట్‌ఫోన్ ధరలకు మళ్లీ షాక్

స్మార్ట్‌ఫోన్ తయారీలో కీలకమైన మెమరీ, చిప్‌సెట్ ధరలు విపరీతంగా పెరగడంతో ప్రముఖ ఫోన్ కంపెనీలు తగ్గిన లాభాల కాపాడుకునేందుకు ధరలు పెంచేస్తున్నాయి. ఇప్పటికే ఆర్థికంగా ఆచి తూచి ఖర్చు చేస్తున్న వినియోగదారులకు శాంసంగ్, రియల్‌మీ, ఒప్పో, వివో, వన్‌ప్లస్ వంటి దిగ్గజ బ్రాండ్లు ఎంపిక చేసిన మోడళ్లపై భారీగా ధరలు పెంచి పెద్ద షాక్ ఇచ్చాయి. ఆగస్టు రెండో వారం తర్వాత నుంచి రియల్‌మీ రూ. 1,000 నుండి రూ. 4,000 వరకు, ఒప్పో రూ. 5,000 వరకు, అలాగే వన్‌ప్లస్ రూ. 4,000 వరకు ధరలను పెంచాయి. ఇక శాంసంగ్ ఏకంగా తమ గెలాక్సీ ఎస్25 వేరియంట్‌పై అత్యధికంగా రూ. 12,000 పెంచడం గమనార్హం. పెరిగిన ధరల వల్ల ఏప్రిల్-జూలై మధ్య స్మార్ట్‌ఫోన్ అమ్మకాలు గతేడాదితో పోలిస్తే బాగా క్షీణించాయని కౌంటర్‌పాయింట్ రీసెర్చ్ తెలిపింది. అమెజాన్ ప్రైమ్ డే, ఫ్లిప్‌కార్ట్ సేల్స్ సమయంలో కొంత అమ్మకాలు కనిపించినప్పటికీ, ఆఫర్లు ముగియగానే మళ్లీ మార్కెట్ పడిపోయింది.

**పండుగ సీజన్‌పై ఆశలు**

ఈ ఏడాది ప్రథమార్థంలోనే సగటు స్మార్ట్‌ఫోన్ ధరలు 15 శాతం పెరిగాయని, విడిభాగాల వ్యయం ఇలాగే కొనసాగితే రాబోయే నెలల్లో మరో 7-10 శాతం ధరలు పెరిగే అవకాశముందని ఐడీసీ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిణామాల వల్ల 2026లో భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్ దాదాపు 13 శాతం తగ్గొచ్చని అంచనా వేస్తున్నారు. అయితే రాబోయే పండుగ సీజన్లో కంపెనీలు ఇచ్చే ప్రత్యేక డిస్కౌంట్లు, నో-కాస్ట్ ఈఎంఐలు, ఫైనాన్సింగ్ ఆప్షన్లు మాత్రమే వినియోగదారులకు కొంత ఊరటనిచ్చి, మార్కెట్ పుంజుకోవడానికి సహాయపడతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ జోరు




ప్రముఖ బీమా సంస్థ 'ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్' తెలంగాణ మార్కెట్లో తన ఆధిపత్యాన్ని చాటుకుంటూ, 2026-27 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో టర్మ్ ప్లాన్ వ్యాపారంలో ఏకంగా 60.7 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసింది. ఈ ఏడాది మార్చి 31 నాటికి తెలంగాణలో రూ. 11,708 కోట్ల నిర్వహణ ఆస్తులు (ఏయూఎం), రూ. 1,52,016 కోట్ల మొత్తం సమ్ అస్యూర్డ్ కలిగి ఉన్న సంస్థ, రాష్ట్రంలో 6.56 లక్షలకు పైగా ప్రజలకు బీమా కవరేజీని అందిస్తోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా అనలిటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతతో 97 శాతం సేవలను ఆన్‌లైన్‌లోనే అందిస్తూ, 99.3 శాతం క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తితో కేవలం ఒక్క రోజులోనే విచారణ లేని క్లెయిమ్‌లను పరిష్కరిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 11 సొంత బ్రాంచీలు, 3,934 పార్ట్‌నర్ బ్రాంచీలు, 6,100 మందికి పైగా అడ్వైజర్లతో విస్తృత నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నామని సంస్థ తెలిపింది. త్వరలో కంపెనీ పేరును 'ఐసీఐసీఐ లైఫ్ ఇన్సూరెన్స్ లిమిటెడ్'గా మారనుందని, తెలంగాణ మార్కెట్లో డిజిటల్ సేవల ద్వారా మరింత విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు వెల్లడించింది.

# బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..




అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ పరిస్థితులు బంగారం, వెండి ధరలను నిత్యం ప్రభావితం చేస్తుంటాయి. ఇటీవల అమెరికా-ఇరాన్ యుద్ధంతో వీటి ధరల్లో భారీగా హెచ్చుతగ్గులు నమోదయ్యాయి. ఈరోజు (శుక్రవారం) ఉదయం 06:30 గంటల సమయానికి గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,59,430గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.1,46,160కి చేరుకుంది.ఆర్థిక రాజధాని ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.1,59,280కి చేరుకోగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రేటు రూ.1,46,010కి చేరుకుంది. అలాగే, హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,59,280ఉండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.1,46,010గా ఉంది. ఇక, వెండి విషయానికి వస్తే కేజీ వెండి ధర రూ.2,60,100కి చేరుకుంది.

# వినియోగదారులకు బిగ్ అలర్ట్..




దేశంలో చెక్కర నిల్వలపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ ఉత్తర్వుల మేరకు నెలకు 10 మెట్రిక్ టన్నుల కంటే ఎక్కువ పంచదారను ఉపయోగించే వినియోగదారులు, 15 రోజులకు మించి పంచదార నిల్వలను ఉంచుకోవడానికి వీల్లేదని పేర్కొన్నారు. అయితే, ఈ కొత్త నిబంధనలు సెప్టెంబర్ 1 నుండి అమల్లోకి రానున్నాయి. ముఖ్యంగా మిఠాయి తయారీదారులు, సాఫ్ట్ డ్రింక్ తయారీదారులు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, స్వీట్ షాపుల యజమానులకు ఈ పరిమితి వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది.అంతేకాకుండా, షుగర్ మిల్లుల నుంచి భారీ వినియోగదారులకు విక్రయించే పంచదార పరిమాణాన్ని తనిఖీ చేయడానికి ప్రభుత్వం ఓ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసింది. ప్రతి షుగర్ మిల్లు నుంచి ఉత్పాదక సంస్థలకు నేరుగా, డీలర్ల ద్వారా విక్రయించబడే పంచదార పరిమాణాన్ని సరిచూడనున్నారు. పంచదారకు సంబంధించిన హెచ్ఎస్ఎన్ కోడ్‌ను ఉపయోగించి అమ్మకందారులు, కొనుగోలుదారులు దాఖలు చేసిన జీఎస్టీ రిటర్న్‌ల ఆధారంగా ఈ వినియోగాన్ని నిర్ధారించనున్నారు. అయితే, ఈ నిల్వ పరిమితి నిబంధన కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలనా విభాగాలు, స్థానిక సంస్థలకు వర్తించదని ఉత్తర్వులలో స్పష్టంగా పేర్కొన్నారు.



# గ్యాస్ సిలిండర్ ధరలు

ఈసారి గృహ వినియోగదారులకు నిరాశే మిగిలింది. ప్రతి నెల 1 వ తారీకు వస్తే చాలు జనాలు గ్యాస్ సిలిండర్ ధరల్లో మార్పు చోటుచేసుకుంటుందన్న కొండంత ఆశతో ఎదురుచూస్తారు. అయితే ఈ నెల తెలంగాణ సర్కారు రెస్టారెంట్లు, హోటల్స్, టీ స్టాల్స్ వంటి పలువురి వ్యాపారులకు శుభవార్త తెలిపింది. 19 కేజీల కమర్షియల్ గ్యాస్ సిలిండర్ పై 206 రూపాయలు తగ్గించింది. కాగా కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధర 2, 985 రూపాయలు కొనసాగుతోంది. మరీ రెండు తెలుగు రాష్ట్రాల్లోని గ్యాస్ సిలిండర్ ధరలు ఏ విధంగా ఉన్నాయో చూద్దాం.

**ఈ రోజు గ్యాస్ సిలిండర్ ధరలు**


హైదరాబాద్: రూ.994.00
వరంగల్: రూ.1013.00
విశాఖపట్నం: రూ.950.00
విజయవాడ: రూ.966.50
గుంటూరు: రూ.966.50




## అందాలతో మతిపోగొడుతున్న బ్యూటీ

బుల్లితెరపై తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ రోష్ని వాలియా. 2001 సెప్టెంబరు 20న ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జన్మించిన ఈ బ్యూటీ.. చిన్న వయసులోనే నటిగా తన ప్రయాణాన్ని ప్రారంభించింది.'మెయిన్ లక్ష్మీ తేరే ఆంగన్ కి', 'బాలికా వధు', 'భారత్ కా వీర్ పుత్ర - మహారాణా ప్రతాప్', 'తారా ఫ్రమ్ సతారా' వంటి ప్రముఖ సీరియల్స్‌లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. బుల్లితెరతో పాటు వెండితెరపై కూడా రోష్ని వాలియా సందడి చేసింది.'మై ఫ్రెండ్ గణేశా 4' చిత్రంలో బాలనటిగా కనిపించిన ఈమె.. 2025లో 'సన్ ఆఫ్ సర్దార్ 2'లోనూ నటించింది. ఇక సోషల్ మీడియాలోనూ ఈ బ్యూటీ చాలా యాక్టివ్‌గా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన గ్లామరస్ ఫొటోలను అభిమానులతో పంచుకుంటూ ఆకట్టుకుంటోంది.తాజాగా ఓ సూపర్ హాట్ లుక్‌లో మెరిసిన రోష్ని.. తన బ్యాక్ అందాలు హైలైట్ అయ్యేలా డిఫరెంట్ యాంగిల్స్‌లో ఫొటోలకు పోజులిచ్చింది. ఈ ఫొటోషూట్‌లో మెడలో నెక్లెస్ ధరించి, కురులను అందంగా వెనక్కి వేసుకున్న రోష్ని.. కొంటె చూపులతో మరింత ఆకర్షణీయంగా కనిపించింది.ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ గ్లామరస్ స్టిల్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఫొటోలను చూసిన నెటిజన్లు ఆమె అందంపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

## ఆ తేదీన 'మిరపకాయ్' రీ-రిలీజ్



మాస్ మహారాజా రవితేజ కెరీర్‌లో మంచి విజయాన్ని సాధించిన చిత్రాల్లో 'మిరపకాయ్' ఒకటి. రిచా గంగోపాధ్యాయ, దీక్షా సేత్ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రానికి హరీష్ శంకర్ దర్శకత్వం వహించారు. ఎల్లో ఫ్లవర్స్ బ్యానర్‌పై రమేష్ పుప్పాల నిర్మించిన ఈ సినిమాకు థమన్ సంగీతం అందించారు. నాగబాబు, ప్రకాష్ రాజ్, సునీల్, అలీ, బ్రహ్మాజీ తదితరులు ఇందులో ముఖ్య పాత్రలు పోషించారు. ఈ మూవీ 2011 సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదలై అప్పట్లో అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకుంది. తాజాగా ఈ సినిమాను రీ-రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. సెప్టెంబర్ 18న ఈ చిత్రాన్ని భారీ ఎత్తున రీ-రిలీజ్ చేయనున్నట్లు ప్రకటిస్తూ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇటీవల టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర పలు చిత్రాలు రీ-రిలీజ్ అయి మంచి ప్రేక్షకాదరణ పొందుతున్నాయి. మరి రవితేజ కెరీర్‌లో సూపర్‌హిట్‌గా నిలిచిన 'మిరపకాయ్' రీ-రిలీజ్‌లో ఎలాంటి ఇంపాక్ట్ చూపిస్తుందో చూడాలి.

## ఆడియెన్స్ చాలా కఠినంగా ఉన్నారు..





అక్కినేని ఫ్యామిలీకి చెందిన హీరోలు కింగ్ నాగార్జున్, యువ హీరోలు నాగచైతన్య, అఖిల్ అక్కినేని ప్రముఖ అంతర్జాతీయ మ్యాగజైన్ 'వెరైటీ ఇండియా' కవర్‌పై తాజాగా సందడి చేశారు. ఈ సందర్భంగా ఇంటర్వ్యూలో పాల్గొని అక్కినేని నాగార్జున తన సినీ ప్రయాణంతో పాటు తన కొడుకుల కెరీర్‌కు సంబంధించిన పలు ఇంట్రెస్టింగ్ విషయాలు పంచుకున్నారు. ఈ మేరకు తన కెరీర్‌లో మైలు రాయిగా నిలిచిన 'గీతాంజలి' చిత్రం గురించి మాట్లాడుతూ.. 'డైరెక్టర్ మణిరత్నంతో కలిసి 'గీతాంజలి' సినిమా చేయడం అప్పట్లో నేను తీసుకున్న సాహసోపేత నిర్ణయాల్లో ఒకటి. 'గీతాంజలి' కోసం 1990లో తీసుకున్న ఆ బోల్డ్ డెసిషన్‌నే నా కెరీర్‌కు కొత్త దిశ చూపించింది. అలాంటి విభిన్నమైన స్టోరీని ఎంచుకునేందుకు అప్పట్లో ఉన్న ఇతర స్టార్ హీరోలు ఎవరు ముందుకు రాలేదు. అయినప్పటికీ నేను ఆ ప్రాజెక్టు చేయాలని నిర్ణయించుకున్నాను. నాలాగే నాగచైతన్య, అఖిల్ కూడా అలాంటి బోల్డ్ డెసిషన్స్ తీసుకోవాలని కోరుకుంటున్నా. ఇప్పటి ఆడియెన్స్ చాలా కఠినంగా ఉన్నారు.. సినిమా నచ్చకపోతే వెంటనే పక్కనపెట్టేస్తా-రు. కాబట్టి వాళ్లను దృష్టిలో పెట్టుకుని కథలు ఎంచుకోవాలి' అంటూ తన అభిప్రాయాలను పంచుకున్నాడు.

## సొసైటీకి తప్పు మెసేజ్ ఇవ్వను..




లవర్ బాయ్‌గా ఫుల్ పాపులారిటీ దక్కించుకున్న సిద్ధార్థ్ నటించిన 'ఆపరేషన్ సఫేద్ సాగర్' అనే కొత్త వెబ్ సిరీస్ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతూ సూపర్ హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సిరీస్ సక్సెస్‌ను ఎంజాయ్ చేస్తున్న సమయంలోనే ఆయన.. తాజాగా ఐటెమ్ పాటల సంస్కృతిపై తన పాత్రల ఎంపికపై చేసిన ఈ ఘాటు వ్యాఖ్యలు హాట్ టాపిక్‌గా మారాయి. నటుడిగా తనకు కొన్ని సొంత నీతులు, పద్ధతులు ఉన్నాయని చెబుతున్నారు సిద్ధార్థ్. అందుకే సమాజానికి చెడు సందేశాన్ని ఇచ్చే ఐటెమ్ పాటల్లో ఎప్పటికీ నటించనని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఒక మహిళ చుట్టూ 40 మంది పురుషులు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించే పాటల్లో తాను నటించలేదని, అలాంటి సంస్కృతిని ప్రోత్సహించడం తన విధానం కాదని తెలిపారు. అంతేకాకుండా, తాను ఎల్లప్పుడూ కేవలం హీరో పాత్రలకే పరిమితం కావాలని అనుకోవడం లేదని వెల్లడించారు. ఒకవేళ హీరో పాత్రలోనే విపరీతమైన చెడు లక్షణాలు ఉంటే అలాంటి కథలను ఒప్పుకోనని తెలిపారు. కథ డిమాండ్ చేస్తే, సినిమాలో చివరికి నాశనమయ్యే క్రూరమైన విలన్ పాత్రలోనైనా నటించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. నటుడిగా సమాజానికి సరైన సందేశం ఇవ్వడమే తన మొదటి ప్రాధాన్యమని.. కానీ సొసైటీకి తప్పు మెసేజ్‌ను ఇవ్వనని ఆయన పేర్కొన్నారు.
ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో దుమారం రేపుతున్నాయి.




## రిలీజ్‌కు ముందే లాభాలు..

మాస్ మహారాజా రవితేజ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఇరుముడి' చిత్రం మరికొన్ని గంటల్లో (ఆగస్టు 21) ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అయింది. ఇందులో ప్రియా భవాని శంకర్ హీరోయిన్‌గా, సాయి కుమార్ ప్రత్యేక పాత్రలో నటిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో దర్శకుడు శివ నిర్వాణ ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు. ఇక ఈ సినిమా రిలీజ్ సందర్భంగా రవితేజ తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ వేదికగా.. 'ప్రతి సినిమా ఒక ప్రత్యేకమైన ప్రయాణాన్ని కలిగి ఉంటుంది.. అందులోనూ 'ఇరుముడి' నాకెంతో ప్రత్యేకమైనది. థియేటర్లలో ఈ సినిమాను మీరందరూ చూడబోతుండటం పట్ల నేను ఎంతో ఉత్సాహంగా ఉన్నాను! స్వామియే శరణం అయ్యప్ప' అంటూ సరికొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. కాగా.. రిలీజ్‌కు ముందే ఈ సినిమా లాభాల బాట పట్టినట్లు తెలుస్తోంది. ట్రేడ్ రిపోర్ట్స్ ప్రకారం.. ఇర-ుముడి బిజినెస్ ఫ్యాన్సీ రేట్స్‌కి జరిగినట్లు సమాచారం. చాలా రోజుల తర్వాత రవితేజ సినిమాకి రిలీజ్‌కి ముందే దాదాపు ₹10 కోట్ల వరకు ప్రాఫిట్ వచ్చిందని టాక్. ఇక సినిమా రిలీజ్ తర్వాత మరో ₹10--20 కోట్ల వరకు ప్రాఫిట్ వచ్చే అవకాశం ఉ ందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సినిమాకి ప్రీ రిలీజ్ బిజినెస్ 20 కోట్లు కాగా బ్రేక్ ఈవెన్ 21 కోట్లు... సినిమా ఫస్ట్ రోజు సాలిడ్ టాక్ వస్తే రవితేజ కి బ్రేక్ ఇన్ మొదటి వారంలో జరిగిపోతుంది.. రిలీజ్ తరువాత ఇక బాక్సాఫీస్‌పై రవితేజ మాస్ జాతర ఎలా ఉంటుందో చూడాల్సి ఉ ండగా.. ఫ్యాన్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.







## ఆ సినిమాకు నో చెప్పి ఉంటే నా కెరీర్ వేరేలా ఉండేది..

"నేను సికింద్రాబాద్‌లోనే పుట్టి పెరిగాను. చిన్నప్పటి నుండి థియేటర్లలో సినిమాలు చూస్తూ, పాటలు వింటూ పెరిగినదాన్ని. ఈ రోజు అదే ఇండస్ట్రీలో ఒక భాగం కావడం నా కల నిజమైనట్లుగా అనిపిస్తోంది. ఎంతోమంది అవకాశాల కోసం ప్రయత్నిస్తుంటారు, అలాంటిది దేవుడి దయ వల్ల నాకంటూ ఒక స్థానం దక్కడం చాలా ప్రత్యేకమైన అనుభూతిని ఇస్తోంది.'చెన్నై లవ్ స్టోరీ' వచ్చాక ప్రజలు నన్ను వాళ్ళ ఇంట్లో మనిషిలా, ఒక చెల్లెలిలా భావిస్తున్నారు. ఆ సినిమాకు నో చెప్పి ఉంటే నా కెరీర్ వేరేలా ఉండేది. మొత్తానికి అదృష్టం కలిసొచ్చింది" అని చెప్పుకొచ్చారు. అలాగే ఈ సినిమాలో ఆ ఒక్క సీన్ చేయడం చాలా కష్టమైందని తెలుపుతూ.. "కథ విన్నప్పుడే ఈ ప్రాజెక్ట్‌కి ఒప్పుకోకపోతే నా లైఫ్‌లోనే పెద్ద తప్పు అవుతుందనిపించింది. ప్రేమ ఓటమితో బాధపడుతూ తాగుడికి అలవాటుపడే నివి అనే ఛాలెంజింగ్ రోల్‌ను నాపై నమ్మకంతో ఇచ్చినందుకు మేకర్స్‌కి థ్యాంక్స్. ముఖ్యంగా శ్మశానవాటికలో వచ్చే సన్నివేశం చేయడం శారీరకంగా, భావోద్వేగపరంగా చాలా కష్టమైంది. సినిమా చూశాక నివి పాత్రలో మమ్మల్ని మేమే చూసుకున్నాం అని ప్రేక్షకులు మెసేజ్‌లు చేస్తుంటే నటిగా ఎంతో గౌరవం పెరిగినట్లు అనిపించిందని అన్నారు. థియేటర్లలో ఈ సినిమాని చాలామంది పదే పదే చూశారు. లవ్ స్టోరీలను ఆడియె-న్స్ ఎలా తీసుకుంటారో చెప్పలేం, కానీ ఈ భావోద్వేగానికి అందరూ బాగా కనెక్ట్ అయ్యారని.. ఇప్పుడు ఆగస్టు 21 నుంచి 'సోనీ లివ్'లో స్ట్రీమింగ్ అవుతోందని చెప్పారు. ఇది తమకు రెండో రిలీజ్ లాంటిదని, థియేటర్లలో చూడనివారు ఓటీటీలో చూసి ఖచ్చితంగా ఆస్వాదిస్తారని శ్రీ గౌరి ప్రియ తెలిపారు.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**